ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
శనివారం 30 ఆగస్టు 2025



• బాలికల వసతి గృహం

జేఎన్టీయూపై శీతకన్ను

ఎక్కడికక్కడే నిలిచిన నిర్మాణాలు

- ఏళ్లుగా సాగుతున్న కళాశాల పనులు
- నిధుల విడుదలపై వర్సిటీ మీనమేషాలు
- అక్టోబరు కల్లా వసతి అన్న వీసీ ప్రకటనకే పరిమితం
- రూ.44.2 కోట్ల ప్రతిపాదనలపై పాలకమండలి నిర్లక్ష్యం

నిర్మాణాలపై నిర్లక్ష్యం

- అక్టోబరు కల్లా వసతి గృహ భవనాలను పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తెస్తామని జేఎన్టీయూ వీసీ గతంలో ఇచ్చిన హామీ ఇప్పటికీ అమలుకు నోచుకోలేదు.
- జేఎన్టీయూ కళాశాల భవన నిర్మాణాలు సగంలోనే నిలిచిపోయాయి.
- క్రీడా ప్రాంగణ భవనాల నిర్మాణం సగంలోనే ఉంది.
- పరిపాలన, ప్రయోగశాలల నిర్మాణాలను ఆరేళ్లుగా సాగదీస్తున్నారు.
- కళాశాల తరగతులకు సంబంధించి మూడు ఫ్లోర్లలో రెండు ఫ్లోర్ల నిర్మాణం మాత్రమే పూర్తి చేశారు. మరో ఫ్లోర్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయలేదు.



నిర్మాణంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్



పూర్తికాని కళాశాల భవనం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో ప్రభుత్వ రంగంలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నరసరావుపేటలో జేఎన్టీయూ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటైంది. ప్రతిభ కలిగిన విద్యార్థులకు సాంకేతిక విద్య అందుబాటులోకి వచ్చిందని.. పల్నాడు, బాపట్ల జిల్లాల సరిహద్దులో కళాశాల ఏర్పాటుతో పల్నాడు జిల్లా అభివృద్ధి చెందుతుందని అందరూ ఆశించారు. అయితే ఇక్కడ పేరుకు కళాశాల ఏర్పాటు చేసినా జేఎన్టీయూ స్థాయిలో నిర్మాణాలు, సౌకర్యాలు లేక విద్యార్థులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఏళ్లుగా నిర్మాణ పనులు సాగుతుండటంతో అసలు ఎప్పటికి కళాశాల పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తుందో తెలియక.. ఇప్పటికే అడ్మిషన్లు తీసుకున్న విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. నిధుల కేటాయింపులో పాలక మండలి నిర్లక్ష్యం వందలాది మంది విద్యార్థులకు శాపంగా మారింది. కళాశాలపై వర్సిటీ పెద్దలు శీతకన్ను ప్రదర్శిస్తున్నారని విద్యార్థులు వాపోతున్నారు. నిధుల లేమితో పనులు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. భవన నిర్మాణాలకు సంబంధించి కమిటీలు రూ.44.2 కోట్ల (మిగతా 6వ పేజీలో)


అధికారుల మరణ శాసనం

- అన్నదాత సుఖీభవతో వెలుగులోకి
- నెపాన్ని ఒకరిపై ఒకరు వేసుకుంటున్న శాఖలు
- అన్నదాత నగదు జమపై గ్రీవెన్స్‌కు 4731 అర్జీలు

గడువు ముగిసినా తహసీల్దార్ లాగిన్లలో పెండింగ్

(చిలకలూరిపేట, ఆంధ్రజ్యోతి)

అధికారుల మరణశాసనం ఇది. నిక్షేపంగా బతికి బాగున్న వారిని చంపేసిన వైనమిది. తమను అధికారులు చంపేసి రికార్డుల్లో నమోదు చేశారన్న విషయం సంబంధిత వ్యక్తులకు కూడా తెలియకపోవడం విశేషం. తీరా అన్నదాత సుఖీభవ సొమ్ము జమ కాకపోవడంతో బాధితులకు అసలు విషయం బోధపడలేదు. మరణించినట్లుగా రికార్డుల్లో ఉండటంతో అన్నదాత సుఖీభవ సొమ్ము చాలా మందికి జమ కాలేదు. బతికుండగానే చనిపోయిన జాబితాలో ఎక్కిన బాధితుల సంఖ్య గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలో ఎక్కువగా కనిపిస్తుంది. అలా



అంబటి భారతీ దేవి మృతి చెందినట్లుగా ప్రభుత్వ రికార్డుల్లో ఉన్న దృశ్యం

నాకు న్యాయం చేయాలి



నేను నిక్షేపంగా ఉన్నాను. అయినా రికార్డుల్లో తప్పుగా నమోదు చేశారు. ఇప్పటికైనా అధికారులు తప్పు సరిచేస్తారా అంటే అదీ లేదు. ఒకరి మీద ఒకరు చెప్పుకుంటున్నారు. ఏమి చేయాలో అర్థం కావడం లేదు. కలెక్టర్ స్పందించి న్యాయం చేయాలి.

- అంబటి భారతీ దేవి, బాధితురాలు

ఎలా జరిగిందని రెవెన్యూ అధికారులను అడిగితే తెలియదని సమాధానం దాటేస్తున్నారు. ఇదేందని వ్యవసాయ శాఖని నిలదీస్తే అసలు తమకు సంబంధమే లేదంటున్నారు. తప్పు జరిగిన తర్వాత కూడా గ్రీవెన్స్‌లో బాధితులు దరఖాస్తు చేసినా అధికారులు చర్యలు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తుంది.

నిక్షేపంలా ఉన్న భారతీదేవి..

బాపట్ల జిల్లా యద్దనపూడి మండలం గన్నవరం గ్రామానికి చెందిన అంబటి భారతీదేవికి వ్యవసాయ భూమి ఉంది. అన్నదాత సుఖీభవ సొమ్ము ఆమెకు జమ కాలేదు. అధికారులను సంప్రదిస్తే మృతి చెందినట్లుగా రికార్డుల్లో నమోదైనట్లు తేలింది. ఇదెలా జరిగిందని వీఆర్వోను ప్రశ్నిస్తే తెలియదన్నారు. జీవించి ఉన్నట్లుగా సర్టిఫికెట్ తీసుకుని తహసీల్దారు, వ్యవసాయ అధికారికి భారతీదేవి చూపించినా (మిగతా 6వ పేజీలో)

చోరీ సొత్తు రికవరీపై దృష్టి సారించండి

నాదెండ్ల పీఎస్ తనిఖీలో ఎస్పీ శ్రీనివాసరావు

నాదెండ్ల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): చోరీలకు సంబంధించి సొత్తు రికవరీలపై దృష్టి సారించాలని ఎస్పీ కంచి శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. నాదెండ్ల పోలీసు స్టేషన్‌ను శుక్రవారం ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది పని తీరు, రికార్డులు, ఎఫ్ఐఆర్ ఇండెక్స్ రిజిష్టర్లను పరిశీలించారు. రూరల్ సీఐ సుబ్బ నాయుడు, ఎస్ఐ పుల్లారావులకు పలు సూచనలు చేశారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ప్రజలకు చేరువ కావాలన్నారు. శాంతిభద్రతలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిర్మూలన, నేర నియంత్రణలో పోలీసులు ముందుండేలా విధులు నిర్వహించాలన్నారు. విచారణ దశలో ఉన్న పోక్సో, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణలను వేగవంతం చేయాలని తెలిపారు. రౌడీషీటర్లపై నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు. ఇసుక, మద్యం, గంజాయి తదితర నిషేధిత పదార్థాల అక్రమ రవాణా, నిల్వలపై దృష్టి సారించి చర్యలు చేపట్టాలన్నారు.




స్టేషన్‌లో రికార్డులను తనిఖీ చేస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

చెక్కుల పంపిణీలో డీఆర్‌డీఏ పీడీ ఝాన్సీరాణి

పిడుగురాళ్ల, ఆగస్టు 29 (ఆంధ్ర జ్యోతి): పొదుపు సంఘ సభ్యులైన ప్రతీ మహిళ పారిశ్రామికవేత్తగా ఎదగాలని, ఇందుకు ప్రభుత్వం పలు రాయితీలు ఇస్తుందని డీఆర్‌డీఏ పీడీ ఝాన్సీ రాణి తెలిపారు. శుక్రవారం పిడుగురాళ్ల వెలుగు కార్యాలయంలో 16 పొదుపు సంఘ మహిళలకు రూ.కోట్ల రుణాలు, 77 మంది మహిళా శక్తి గ్రూపులకు రూ.77 లక్షలు, పీఎంఎఫ్ఎంఈ ద్వారా ఆరుగురికి రూ.6 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల ఆర్థిక పురోభివృద్ధికి ప్రభుత్వం సహాయ సహకారాలు అందించడమే కాకుండా పొదుపు సంఘాలను బలోపేతం చేసే దిశగా పనిచేస్తుందన్నారు. జిల్లాలో 2727 మంది దివ్యాంగ పింఛన్‌దారులకు నోటీసులు ఇవ్వగా ఇప్పటికి 1809 మంది అప్పీల్ చేసుకున్నారన్నారు. సెప్టెంబరు 1 లోపు అప్పీల్ చేసుకున్న వారికి పింఛన్ అందజేస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామీణ బ్యాంక్ రీజనల్ మేనేజర్ సుభాష్, జూలకల్లు బ్రాంచ్ మేనేజర్ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.



పొదుపు మహిళలకు చెక్కు అందజేస్తున్న డీఆర్‌డీఏ పీడీ ఝాన్సీరాణి

మహిళల అభ్యున్నతే లక్ష్యం

స్త్రీశక్తితో తిరుగులేని శక్తిగా ఆడబిడ్డలు ● కారంపూడి స్త్రీశక్తి సభలో మంత్రి గొట్టిపాటి రవికుమార్



హాజరైన మహిళలు, కార్యకర్తలు



సుగాలీలతో మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డి

కారంపూడి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మహిళల అభ్యున్నతే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లా వద్ద ఏర్పాటు చేసిన స్త్రీశక్తి విజయోత్సవ సభలో మంత్రి ప్రసంగించారు. మహిళల సాధికారితకు సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. మహిళల ఆర్థిక చేయూతకు తల్లికి వందనం, స్త్రీశక్తి(ఉచిత బస్సు ప్రయాణం), దీపం పథకం అమలు చేస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఎక్కడా రాజీపడేది లేదన్నారు. అర్హులైనప్పటికీ పింఛన్ రాకుంటే ప్రభుత్వ అధికారులను సంప్రదిస్తే వారికి పింఛన్ మంజూరు చేస్తారన్నారు.

తిరుగులేని శక్తిగా ఆడబిడ్డలు

: ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డి

స్త్రీశక్తితో తిరుగులేని శక్తిగా ఆడబిడ్డలు ఎదుగుతారని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మనందరెడ్డి తెలిపారు. సూపర్ సిక్స్ హామీలన్నీ అమలుతో పాటు రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతుంటే ఏ ముఖం పెట్టుకుని ధర్నాలు చేస్తావని జగన్‌ను ప్రశ్నించారు. విజయోత్సవ సభకు నియోజకవర్గం వ్యాప్తంగా దాదాపు 8 వేల మందికిపైగా మహిళలు తరలివచ్చారు. సుగాలీల నృత్యం ఆకట్టుకుంది. మహిళల కోలాటం ఆకర్షణీయంగా నిలిచింది. వేదికపై గర్భిణులకు సీమంతం నిర్వహించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీ శిల్పారామం, హస్తకళల అభివృద్ధి ఛైర్‌పర్సన్ మంజులారెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కుర్రి శివారెడ్డి, మాచర్ల మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ మద్దిగపు పెద వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏపీఈఎస్ఎస్ఏ ఎన్నిక ఏకగ్రీవం

నరసరావుపేట టౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ సబ్ ఆర్డినేట్ అసోసియేషన్(ఏపీఈఎస్ఎస్ఏ) జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అర్థగణాంక అధికారి, ఏపీఈఎస్ఎస్ఏ ఎలక్షన్ అధికారి మాలతీదేవి శుక్రవారం తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షుడుగా వీ ప్రభాకర రావు, ఉపాధ్యక్షుడుగా ఎం కృష్ణకిశోర్, సెక్రటరీగా వీ నాగేంద్ర బాబు, జాయింట్ సెక్రటరీగా జే సూర్యనారాయణ, కోశాధికారిగా ఎస్‌వీ సుబ్రహ్మణ్యంలు ఎన్నికయ్యారు.



నూతన కార్యవర్గ ఎన్నిక పత్రాలు అందజేస్తున్న ఎన్నికల అధికారి పీ మాలతీదేవి

యూరియా తరలింపు కేసులో

ఇద్దరు డ్రైవర్ల అరెస్టు

దాచేపల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా నుంచి తెలంగాణకు అక్రమంగా యూరియా బస్తాలను తరలిస్తున్న వాహనాల డ్రైవర్లను అరెస్టు చేసినట్లు శుక్రవారం పోలీసులు తెలిపారు. అనుమతి లేకుండా కారంపూడి నుంచి తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం యూరియా బస్తాలను రెండు వాహనాల్లో తరలిస్తుండగా దాచేపల్లి చెక్‌పోస్టు వద్ద గురువారం స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. వాహనాలను, డ్రైవర్లను అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారించి సఖిల సురేష్, గొలగని సుధీర్‌లను అరెస్టు చేశారు. అక్రమ తరలింపులో భాగస్వాములైన పలువురు వ్యాపారులను, దళారులను కూడా అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.



బార్లు మాకొద్దు.. బాబోయ్

అరకొరగానే దరఖాస్తులు

- గడువు పెంచినా కొరవడిన స్పందన
- ఎక్సైజ్ అధికారుల ప్రయత్నాలు విఫలం
- మూడో వంతు బార్లకు అందని దరఖాస్తులు
- బాపట్ల జిల్లాలో నాలుగు బార్లకే పూర్తిస్థాయిలో..
- గుంటూరు జిల్లాలో 35, పల్నాడు జిల్లాలో 16 అర్హత
- నిబంధనల ప్రకారం దరఖాస్తులు వచ్చిన బార్లకు నేడు లాటరీ

నరసరావుపేట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): బార్లు అంటే మద్యం వ్యాపా రులు భయపడుతున్నారు. గడువు పొడిగించినా బార్లకు దరఖాస్తులు చేసేందుకు వ్యాపారులు ముందుకు రాలేదు. ప్రభుత్వం నూతన మద్యం పాలసీ ప్రకారం బార్లకు దరఖాస్తులు ఆహ్వానించింది. అయితే తొలుత ఇచ్చిన గడువు ఈ నెల 26 కాగా స్పందన మరీ పేలవంగా ఉండడంతో శుక్రవారం వరకు ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. ఈ క్రమంలో ఎక్సైజ్ అధికారులు ఎక్కడికక్కడ వ్యాపారులతో ఎలాగైనా బార్లకు దరఖాస్తులు చేయించాలని పలు ప్రయత్నాలు చేశారు. అయినా వ్యాపారులు ముందుకు రాలేదు. శుక్రవారం రాత్రి గడువు ముగిసేప్పటికి గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో మూడో వంతు బార్లకు నిబంధనలకు అనుగుణంగా దరఖాస్తులు రాలేదు. లాటరీ ప్రక్రియ జరగాలంటే ఒక్కో బార్‌కు 4 దరఖాస్తులు రావాలనే నిబంధనను పెట్టింది. మూడు జిల్లాల్లో మొత్తం 178 బార్లకు ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వగా గడువు ముగిసేప్పటికి 55 బార్లకు మాత్రమే పూర్తి స్థాయిలో దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తు రుసుంతో పాటు ఏడాదికి చెల్లించాల్సిన లైసెన్స్ ఫీజు కూడా భారమవుతుందని, వైన్ షాపులకు పర్మిట్ రూములతో లాభాలు కష్టమని వ్యాపారులు బార్ల వ్యాపారానికి మొగ్గు చూపలేదని తెలుస్తోంది. రిజిస్ట్రేషన్ ఫీజుతో కలిపి దరఖాస్తు సమయంలోనే (మిగతా 6వ పేజీలో)

ఏషియన్ షూటింగ్ పోటీల్లో మెరిసిన ముకేష్



పత కాలతో ముకేష్

గుంటూరు(క్రీడలు) ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): కజకిస్థాన్‌లోని షెమ్కెంట్ నగరంలో శుక్రవారం ముగిసిన ఏషియన్ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో గుంటూరు కు చెందిన నేలవల్లి ముకేష్ మూడు బృంద బంగారు పతకాలతో పాటు ఒక వ్యక్తిగత కాంస్య పతకం సాధించాడు. జూనియర్ విభాగంలో 50 మీటర్ల ఫ్రీ పిస్టల్, 25 మీటర్ల స్టాండర్డ్ పిస్టల్, 25 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్ టీమ్ విభాగాల్లో తన సహచరులతో కలిసి మూడు బంగారు పతకాలు సాధించాడు. టోర్నీ చివరి రోజైన శుక్రవారం 25 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో కాంస్యంతో పాటు టీమ్ విభాగంలో సూరజ్ శర్మ, అభినవ్ చౌదరితో కలిసి మరో బంగారు పతకాన్ని సాధించాడు. ఈ సందర్భంగా ముకేష్‌ను కాస్త రైఫిల్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు నలలిత్, రాజ్ కుమార్ కేఎల్ యూనివర్సిటీ స్పోర్ట్స్ డీన్ హరి కిషోర్ అభినందించారు.

టీడీపీ నేత కొల్లి లక్ష్మయ్య హఠాన్మరణం


కొల్లి లక్ష్మయ్య చౌదరి

మంగళగిరి సిటీ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం నవులూరు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కొల్లి లక్ష్మయ్య చౌదరి (60) హఠాన్మరణం చెందారు. అనారోగ్య కారణాల రీత్యా గత కొంత కాలంగా ఆయన రాజకీయాలకు దూరంగా వుంటున్నారు. గురువారం రాత్రి తీవ్ర అస్వస్థతకు గురైన లక్ష్మయ్య చౌదరిని విజయవాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం కన్నుమూశారు. లక్ష్మయ్య చౌదరి నవులూరు గ్రామ సర్పంచ్‌గా, సర్పంచుల సంఘం రాష్ట్ర కన్వీనర్‌గా, ఎర్రబాలెం ఎంపీటీసీ సభ్యుడిగా పనిచేశారు. టీడీపీ వ్యవస్థాపకుడు స్వర్గీయ ఎన్టీ రామారావుకు సన్నిహితంగా వుంటూ మంగళగిరి నియోజకవర్గ టీడీపీలో క్రియాశీలక పాత్ర పోషించారు. నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి ఎనలేని సేవలు అందించారు. పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు లక్ష్మయ్య చౌదరి భౌతికకాయాన్ని సందర్శించి నివాళి అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

అధికారుల.. మరణ శాసనం

(5వ పేజీ తరువాయి)

ఆమెకు ప్రయోజనం దక్కలేదు. భారతీదేవిలా చాలామంది వృద్ధులను మృతుల జాబితాలో చేర్చారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో కొందరు బాధితులు ముందే మేల్కొని సరి చేయించుకున్నారు. చాలామందికి విషయం తెలియక ఆలస్యం గా అధికారులను సంప్రదిస్తున్నారు. ఇలా మృతి చెందినట్లు చూపించిన వారి సమస్యను ఎలా పరిష్కరిస్తారన్న విషయంపై అధికారుల నుంచి సరైన సమాధానం లేదని బాధితులు వాపోతున్నారు.

గడువు ముగిసినా...

అన్నదాత సుఖీభవ పథకం అమలులో వచ్చిన సమస్యలు పరిష్కారానికి వినతుల స్వీకరణకు ఈ నెల 20 వరకు ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. గుంటూరు జిల్లాలో 967, పల్నాడు జిల్లాలో 2145, బాపట్ల జిల్లాలో 1617 మంది అధికారులకు అర్జీలు ఇచ్చారు. వాటిలో ఎక్కువ శాతం మండల వ్యవసాయ అధికారులు క్లియర్ చేశారు. పల్నాడు జిల్లాలో 1952, గుంటూరు జిల్లాలో 918, బాపట్ల జిల్లాలో 1310 అర్జీలను పరిష్కరించారు. తహసీల్దార్ లాగిన్‌కి వెళ్లిన అర్జీలలో చాలావరకు పెండింగ్‌లో ఉన్నాయి. పల్నాడు జిల్లాలో తహసీల్దారు లాగిన్‌లోకి 56 అర్జీలు వెళ్లగా కేవలం 15 మాత్రమే పరిష్కరించారు. గుంటూరు జిల్లాలో 19 అర్జీల్లో 3, బాపట్ల జిల్లాలో 46 అర్జీల్లో 23 మాత్రమే తహసీల్దార్లు పరిష్కరించినట్లు సమాచారం.

ముగిసిన మెగా డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన


చంటి బిడ్డతో హాజరైన అభ్యర్థి


ఏసీ కళాశాలలో హాజరైన అభ్యర్థులు


సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న అధికారులు

గుంటూరు (విద్య) ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన శుక్రవారం ముగిసింది ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు పది క్యాడర్లలో 1,650 పోస్టులకు గాను గురువారం 930 మందికి సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి కాగా శుక్రవారం 718 మందికి సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించినట్లు వెల్లడించారు. షెడ్యూల్ ప్రకారం అభ్యర్థులకు త్వరలో కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్ ఆర్డర్స్ ఇవ్వనున్నట్లు విద్యాశాఖ అధికారులు అధికారులు తెలిపారు. 36 మంది దివ్యాంగ అభ్యర్థుల కోసం ప్రభుత్వాసుపత్రిలో ప్రత్యేక సర్టిఫికెట్లు, సామర్థ్య పరిశీలన నిర్వహించారు.

ఒంగోలు జాతి పశుసంపదను సంరక్షించుకోవాలి

● ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు


పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

ప్రత్తిపాడు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు జాతి పశు సంపదను సంరక్షించు కోవాల్సిన అవసరం ఉందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. ప్రత్తిపాడులో జాతీయ స్థాయి నందమూరి తారక రామారావు మెమోరియల్ ఒంగోలు జాతి ఎడ్ల బండ లాడుగు పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. రైతులు పంటలతో పాటు పశు పోషణ కూడా చేయాలన్నారు. పశుపోషణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక తయారు చేస్తుందన్నారు. నియోజకవర్గ జనసేన కన్వీనర్ కొర్రపాటి నాగేశ్వరరావు, గింజుపల్లి వెంకటేశ్వరరావు, నక్కల అగస్టియన్, కల్లూరి శ్రీనివాసరావు, కుర్రి సుబ్బారెడ్డి, గింజుపల్లి శివ రామప్రసాద్, పమిడి శ్రీనివాసరావు, కాకాని సురేష్ బాబు, తాతిరెడ్డి లక్ష్మారెడ్డి, మలినేని పెరుమాళ్ల పాల్గొన్నారు.

సత్తా చాటిన పల్నాడు ఎడ్ల జత

ఒంగోలు జాతి ఎడ్ల బండలాడుగు పోటీలు.. తొలి రోజు పాల పళ్ల విభాగంలో హోరా హోరీగా జరిగాయి. తెలుగు రాష్ట్రాల నుంచి 22 జతల ఎడ్లు బరిలో నిలిచాయి. పల్నాడు జిల్లా కావురు లింగంగుంట గ్రామానికి చెందిన మైలా త్రివేణి ఎడ్ల జత 3,900 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానంలో నిలిచింది. కృష్ణా జిల్లా నాగాయలంక మండలం నంగేగడ్డ, నాగాయలంక గ్రామాలకు చెందిన ముమ్మా ప్రభు కుమారి, సంకా పవన్‌ల ఎడ్ల జతలు 3779.7 అడుగులు దూరం లాగి ద్వితీయ స్థానంలో నిలిచాయి. ప్రకాశం జిల్లా కురిచేడు మండలం, పడమర గంగవరం గ్రామానికి చెందిన బంకా గురవారెడ్డి ఎడ్ల జత 3614.4 అడుగుల దూరం తృతీయ స్థానంలో నిలిచాయి. ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడు మండలం, చింతలపాడు గ్రామానికి చెందిన పయ్యావుల నాగేశ్వరరావు ఎడ్ల జత నాలుగవ స్థానంలో, గుంటూరు జిల్లా పిరంగిపురం మండలం, కండ్రిక గ్రామానికి చెందిన కేలం పద్మనాయుడు ఎద్దు, ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడు మండలం, తోటరావులపాడు గ్రామానికి చెందిన కోటి రాజ్యం ఎద్దు జత ఐదవ స్థానంలో నిలిచాయి. విజేతలకు నగదు బహుమతులతో పాటు మెమెంటోలను ప్రదానం చేశారు.

డీసీఎంఎస్‌కు అత్యధికంగా యూరియా నిల్వలు కేటాయించాలి

● మార్క్ ఫెడ్ ఎండీకి చైర్మన్ హరిబాబు విజ్ఞప్తి


మార్క్‌ఫెడ్ ఎండీకి వినతిపత్రం అందజేస్తున్న చైర్మన్ హరిబాబు, బీఎం

గుంటూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లా డీసీఎంఎస్‌కు అత్యధికంగా యూరియా నిల్వలు కేటాయించి అండగా నిలవాలని చైర్మన్ వడ్రాణం హరిబాబు నాయుడు మార్క్ ఫెడ్ ఎండీ డాక్టర్ మంజీర్ జిలాని నమూస్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం రాజధానిలో మార్క్ ఫెడ్ ఎండీని మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం హరిబాబు నాయుడు మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్ లో రైతులకు మేలు చేసేందుకు గుంటూరు జిల్లా డీసీఎంఎస్ సంస్థకు ఎక్కువ మొత్తంలో యూరియా, ఎరువులను పంపిణీ చేసేందుకు సీఎం చంద్రబాబు, వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌లు కేంద్రంలోని ఉన్నతాధికారులతో నిరంతరం చర్చిస్తూ రైతులకు అండగా నిలుస్తున్నారన్నారు. యుద్ధ ప్రాతిపదికన గుంటూరు జిల్లాకు ఎరువులను కేటాయించాలని అభ్యర్థించిన వెంటనే మంచి హృదయంతో స్పందించిన ఏపీ మార్క్ ఫెడ్ ఎండీకి కూడా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ హరగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాలను సర్వనాశనం చేసేందుకే 130వ రాజ్యాంగ సవరణ

● కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్


చింతా మోహన్

గుంటూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రతిపక్షాలను సర్వనాశనం చేసేందుకే 130వ రాజ్యాంగ సవరణ బిల్లును కేంద్రం తీసుకొచ్చిందని, దేశానికి ఇది మంచి పరిణామం కాదని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ ఆందోళన వ్యక్తం చేశారు. గుంటూరులో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిపక్షాలను దెబ్బ కొట్టాలని కుట్రతో ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా కలిసి ఈ బిల్లును రూపొందించారని మండిపడ్డారు. కమ్యూనిస్టులు ప్రతిరోజూ ప్రజా సమస్యలపై ధర్నాలు చేస్తుంటారని, 30 రోజులు జైలులో పెడితే చట్టసభలకు ప్రాతినిత్యం కోల్పోవాలా అని ప్రశ్నించారు. దేశంలో పది మంది ముఖ్యమంత్రులపై కేసులున్నాయని ఎన్నికల అఫిడవిట్‌లలో ఉన్నాయన్నారు. మహిళా ఐఏఎస్ అధికారి శ్రీలక్ష్మిపై వైసీపీ వ్యక్తిగత విమర్శలు హేయమన్నారు. రాజశేఖర్‌రెడ్డి ఎక్కడ సంతకాలు పెట్టమంటే, అక్కడ పెట్టి శ్రీలక్ష్మి జైలుకు పోయారని గుర్తుచేశారు.

బార్లు..మాకొద్దు బాబోయ్

(5వ పేజీ తరువాయి)

రూ.5,10,000 చెల్లించాల్సి ఉండడం వెనకడుగుకు కారణంగా ఉంది. తొలుత ఇచ్చిన గడువు పెంచడంతో పాటు, ఆశావహులతో సమావేశాలు, ఎన్‌రోల్‌మెంట్ చేసుకున్న వారితో దరఖాస్తుల వేయమనే సంప్రదింపులు ఇలా అన్ని వైపుల నుంచి ఎక్సైజ్ అధికారులు ప్రయత్నించినా గడువు ముగిసే సమయానికి కనీస స్థాయిలో కూడా స్పందన కనబడకపోవడం గమనార్హం. ఇదిలా ఉంటే ముందుగా ప్రకటించిన తేదీ ప్రకారం శనివారం కలెక్టరేట్ వేదికగా బార్ల లైసెన్సు కోసం లాటరీ ప్రక్రియ జరుగుతుందని, దరఖాస్తు దారులంతా ఉదయం 8 గంటలకే ఆయా కలెక్టరేట్లకు చేరుకోవాలని ఎక్సైజ్ అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మిగతా వాటి విషయంలో ప్రభుత్వ నిర్ణయం ఎలా ఉండబోతుందున్న ఉత్కంఠ అందరిలో నెలకొంది.

● బాపట్ల జిల్లాలో మొత్తం 19 బార్లకు ఎక్సైజ్ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే నాలుగు బార్లకు మాత్రమే నిబంధనల ప్రకారం దరఖాస్తులు వచ్చాయి. అద్దంకిలో ఓ బార్‌కు 5, చీరాలలో ఓ బార్‌కు 5 దరఖాస్తులు వచ్చాయి. రేపల్లె, బాపట్లలో గీత కార్మికులకు బార్లు కేటాయించగా రేపల్లెలోని బార్‌కు లాటరీ తీయడానికి కావాల్సిన దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలో నాలుగు బార్లు మాత్రమే లాటరీకి అర్హత సాధించాయి.

● గుంటూరు జిల్లాలో 110 బార్లకు గడువు ముగిస్వేటికి 48 దరఖాస్తులు వచ్చాయి. 35 బార్లకు మాత్రమే నాలుగు దరఖాస్తులు వచ్చాయి. వీటికి మాత్రమే లాటరీ నిర్వహణకు అర్హత సాధించాయి. జిల్లాలో గౌడ సంఘానికి పది బార్లు కేటాయించగా 68 దరఖాస్తులు వచ్చాయి. కేటాయించిన పది బార్లకు లాటరీ అర్హత పొందాయి.

● పల్నాడు జిల్లాలో 49 బార్లకు 65 దరఖాస్తులు వచ్చాయి. అందులో కేవలం 16 బార్లకు మాత్రమే లాటరీ నిర్వహించే అర్హత ప్రకారం దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలో గౌడ సంఘానికి ఐదు బార్లు కేటాయించగా, 22 దరఖాస్తులు వచ్చాయి. ఐదు బార్లు లాటరీ నిర్వహించేందుకు అర్హత పొందాయి.

జేఎన్టీయూపై శీతకన్ను

(5వ పేజీ తరువాయి)

కేటాయింపునకు ఆమోదం తెలిపాయి. అయితే వర్సిటీ పాలక మండలి ఆ నిధుల విడుదలపై కనికరం చూపడంలేదు. బాలుర, బాలికల వసతి గృహాల నిర్మాణ పనులు చేపట్టి ఏళ్ల గడుస్తున్నా పూర్తి చేయడంలో ఉన్నతాధికారులు నిర్లక్ష్యంగా ఉంటున్నారు. దీంతో నరసరావుపేట నుంచి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న కళాశాలకు రావడానికి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. బాలికల వసతిగృహాల పనుల పూర్తికి, 500 మీటర్ల పొడవును ప్రహరీ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపారు. రూ.11.20 కోట్లు విడుదల చేస్తేనే వసతిగృహాల పనులు ముందుకు సాగుతాయి. వెంటనే నిధులు విడుదల చేస్తే కనీసం రెండు మూడు నెలల్లో వసతిగృహాలు వినియోగంలోకి వచ్చే అవకాశం ఉంది. అయితే దీనిపై నేటి వరకు వర్సిటీ నిర్ణయం తీసుకోలేదు.

అరకొర వసతులతోనే నిర్వహణ

ప్రతిష్ఠాత్మకంగా ఉండాల్సిన జేఎన్టీయూ కళాశాలలో అరకొర వసతులతోనే నిర్వహిస్తున్నారు. ప్రతిభ కలిగిన విద్యార్థుల భవిష్యత్‌తో వర్సిటీ ఉన్నతాధికారులు ఆటలాడుకుంటున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భవనాల నిర్మాణానికి జేఎన్టీయూ కాకినాడ రూ.90 కోట్లు మంజూరు చేయగా కేవలం తరగతులు నిర్వహించేందుకు వీలుగా పనులు పూర్తి చేశారు. పూర్తి స్థాయిలో భవనాల నిర్మాణం జరగలేదు. రూ.33 కోట్లు నిధులు మంజూరు చేస్తేనే కళాశాల భవనాల నిర్మాణం పూర్తయ్యే పరిస్థితి ఉంది. ఇందుకు సంబంధించి పాలక మండలి ఆమోదం తెలిపి ఏడాది అయినా నిధులు విడుదల కాలేదు. వైసీపీ హయాంలో నిరాదరణకు గురైన కళాశాల కూటమి ప్రభుత్వంలోనైనా అభివృద్ధి సాధిస్తుందని, వసతులు సమకూరుతాయన్న విద్యార్థుల ఆశ అడియాసగానే మారింది. కనీసం వసతి గృహాలను పూర్తి చేసి వినియోగం లోకి తీసుకు రావాలని కోరుతున్నారు.

తల్లిదండ్రులపై దాడికి పాల్పడిన కొడుక్కి జైలుశిక్ష

పిడుగురాళ్ల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఆస్తి కోసం తల్లిదండ్రులపై దాడి చేసిన కొడుక్కి.. కింది కోర్టు విధించిన శిక్షను 10వ అదనపు జిల్లా కోర్టు న్యాయాధికారి ఖరారు చేస్తూ శుక్రవారం తీర్పునిచ్చారు. గురజాలకు చెందిన నల్ల పెదరాములు తనకున్న 5 ఎకరాలలో రెండున్నర ఎకరాలు తన కొడుకు శ్రీనివాసరావుకు రాసి ఇచ్చాడు. మిగిలిన భూమిని తన పోషణ నిమిత్తం తన వద్దనే ఉంచు కున్నాడు. కొడుకు శ్రీనివాసరావు ఆ భూమి కూడా తనకే రాసివ్వాలని తల్లిదండ్రులపై ఒత్తిడి చేయసాగాడు. అంతేకాకుండా కౌలు దారులను కూడా బెదిరింపులకు పాల్పడ్డాడు. 2015 జూలై 12న ఇంట్లో నిద్రిస్తున్న తల్లిదండ్రులపై కర్రతో దాడి చేశారు. ఈ మేరకు శ్రీనివాసరావుపై నమోదైన కేసులో.. దిగువ కోర్టు విధించిన శిక్షను ఖరారు చేస్తూ 10వ అదనపు జిల్లా కోర్టు న్యాయాధికారి ప్రియదర్శిని ముద్దాయి అప్పీల్‌ను డిస్మిస్ చేశారు. ఏపీపీ సూర్యరాజు వాదనలు వినిపించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.60 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	106, 114, 125
చికెన్ విత్ స్కిన్(కిలో)	204.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	214.00

దూరవిద్యలో.. పీజీ ప్రవేశాలకు ఏఎన్‌యూ ఆహ్వానం

● 23 పీజీ కోర్సులకు యూజీసీ అనుమతి
● సీడీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ వంకాయలపాటి వెంకటేశ్వర్లు


ఒప్పంద పత్రాలను చూపిస్తున్న వీసీ గంగాధరరావు, కళాశాల ప్రతినిధులు

ఏఎన్‌యూ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం (ఏఎన్ యూ) సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్.. పీజీ దూర విద్య ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేసిందని సీడీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ వంకాయలపాటి వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం వర్సిటీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. 2025- 26 విద్యా సంవత్సరానికి సెమిస్టర్ విధానంలో యూజీసీ, డెబ్(డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో) 23 పీజీ కోర్సులకు అనుమతి ఇచ్చిందన్నారు. దరఖాస్తుల స్వీకరణ గడువు అక్టోబర్ 10వ తేదీతో ముగుస్తుందని తెలిపారు. కోర్సులు, కాల వ్యవధి, విద్యా అర్హతలు, ఫీజులు తదితర వివరాలకు 0863-2346222, 98484 77441 నంబర్లను సంప్రదించాలని సీడీఈ డైరెక్టర్ తెలిపారు.

21న ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశ పరీక్ష

ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాలు-2025 షెడ్యూల్ విడుదలైంది. దూర విద్యలో మ్యాథ్స్ డిగ్రీ చదివిన వారిని కూడా అర్హులుగా గుర్తిస్తారు. సెప్టెంబర్ 21న ఏఎన్‌యూ ప్రవేశ పరీక్ష ఉంటుంది. ఐసెట్‌లో ర్యాంక్ పొందిన అభ్యర్థులు నేరుగా ప్రవేశం పొందవచ్చు.

కేఐఎఫ్టీ ఫ్యాషన్ కళాశాలతో అవగాహన ఒప్పందం

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం - విజయవాడ, కాకినాడలోని కేఐఎఫ్టీ ఫ్యాషన్ కళాశాల మధ్య శుక్రవారం అవగాహన ఒప్పందం కుదిరింది. ఏఎన్‌యూ తాత్కాలిక ఉపకులపతి ఆచార్య గంగాధరరావు సమక్షంలో తాత్కాలిక రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం, కేఐఎఫ్టీ ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రతినిధులు అవగాహన ఒప్పందం పత్రంపై సంతకాలు చేశారు. ఒప్పందంలో భాగంగా వర్సిటీలో ఫ్యాషన్ డిజైన్, ఇంటీరియర్ డిజైన్ రంగాల్లో నాలుగు సంవత్సరాల బీఎస్సీ ఆనర్స్‌తో పాటు ఏడాది కాల పరిమితితో కూడిన డిప్లొమా, సర్టిఫికేట్ కోర్సులను ప్రారంభించనున్నారు. రెక్టార్ ఆచార్య రత్న షీలామణి, కేఐఎఫ్టీ విద్యా సంస్థల చైర్మన్ కె.లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో రైతు కూలీ మృతి

భట్టిప్రోలు (కొల్లూరు), ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): అతివేగంగా వస్తున్న కారు ఢీకొని రైతు కూలీ మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ శివయ్య వివరాల మేరకు.. భట్టిప్రోలు పంచాయతీ అద్దేపల్లి గ్రామానికి చెందిన రంగిశెట్టి జయచంద్రరావు (55) సైకిల్‌పై జాతీయ రహదారిలో తాగునీరు తీసుకుని పొలానికి వెళ్తున్నాడు. రేపల్లె వైపు వేగంగా వస్తున్న కారు జయచంద్రరావును ఢీకొట్టింది. ఈ ఘటనలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య అన్నపూర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిమిత్తం రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు మృతదేహాన్ని తరలించినట్లు ఎస్ఐ చెప్పారు.

హత్యాయత్నం కేసులో జైలు, జరిమానా

నరసరావుపేట లీగల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియా వివాదం నేపథ్యంలో ఓ వ్యక్తిపై హత్యాయత్నానికి పాల్పడినట్లు నేరం రుజువు అవడంతో నిందితులు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఏడుగురికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.10 వేల వంతున జరిమానా విధిస్తూ స్థానిక అదనపు సహాయ సెషన్స్ న్యాయాఅధికారి ఎన్.లావణ్య శుక్రవారం తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వీర శ్రీ నాగ వెంకట సత్యనారాయణ, సీహెచ్ నాని, ఎం.చిన్న వెంకయ్య, రామిశెట్టి రవి, వి.ఈశ్వర వరప్రసాద్, ఎస్.భవాని శంకర్, మరికొంత మంది ఓ కుల సంఘం పేరుతో వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేశారు. ఈ గ్రూపు కుల సంఘానికి నిధులను సమీకరిస్తుంది. నిధులు దుర్వినియోగం అవుతున్నాయని చిలకలూరిపేటకు చెందిన తోట నాగవేణు గ్రూపులో స్పందించాడు. దీంతో ఆగ్రహించిన గ్రూపులోని సభ్యులు 2021 జనవరి 29న చిలకలూరిపేటకు వచ్చి నాగ వేణు గృహంలోకి అక్రమంగా ప్రవేశించి హత్యయత్నానికి పాల్పడ్డారు. చుట్టుపక్కల వాళ్లు రావడంతో నిందితులు అక్కడ నుంచి పారిపోయారు. ఈ మేరకు నాగ వేణు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణలో గత నెల 24న నేరం రుజువైనట్లు న్యాయాధికారి ప్రకటించారు. నిందితులు కోర్టుకు హాజరు కాకపోవడంతో నాన్ బైలబుల్ వారంటు జారీ చేశారు. అయితే వారు స్వచ్ఛందంగా శుక్రవారం కోర్టులో లొంగిపోయారు. ప్రాసిక్యూషన్‌గా ఏపీపీ గుండాల సురేష్ బాబు, ఎస్సై ఎం.మోహన్ కేసు దర్యాప్తు చేశారు.

వినుకొండలో.. పట్టపగలు చోరీ


పగలగొట్టిన బీరువా

వినుకొండ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విష్ణు కుండినగర్‌లో నిత్యం రద్దీగా ఉండే రామాలయం వద్ద పట్టపగలే శుక్రవారం దోపిడీ జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం.. రామాలయం వద్ద నివాసం ఉండే గద్దె వెంకట్రావు బజారుకెళ్లగా, భార్య బంధువుల ఇంటికి వెళ్లింది. అదును చూసిన దొంగలు ఇంటి తాళం పగలగొట్టి బీరువాలో నల్లపూసల గొలుసు, బంగారు చైన్, రెండు ఉంగరాలు, రూ.10 వేల నగదు దొంగిలించుకెళ్లారు. వారం క్రితం ఇదే రామాలయం బజారులో దొంగతనానికి ప్రయత్నించిన దొంగలే ఈ దొంగతనం చేసి ఉంటారని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులను వివరణ కోరగా తమకు ఎలాంటి సమాచారం అందలేదని తెలిపారు.

కలెక్టరేట్‌లో ఎరువుల మానిటరింగ్..

కంట్రోల్ రూం ఏర్పాటు

బాపట్ల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ జె.వెంకటమురళి ఆదేశాల మేరకు కలెక్టరేట్‌లో ఎరువుల మానిటరింగ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. రైతుల ఫిర్యాదుల కోసం హెల్ప్‌లైన్ నెంబరు 8247040131గా ప్రకటించారు. యూరియా, ఇతర ఎరువులు అందుబాటులో లేకపోతే వెంటనే సమాచారం ఇవ్వాలని కలెక్టర్ తెలిపారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధర వసూళ్ళు చేసినా ఫిర్యాదు చేయాలన్నారు. నకిలీ ఎరువు విక్రయించినా, కృత్రిమ ఎరువుల కొరత సృష్టించిన వారిపై కఠినచర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

నేడు పురపాలక సంఘం కౌన్సిల్ సాధారణ సమావేశం

మాచర్ల రూరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో ఈ నెల 30వ తేదీన కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ధూళిపాళ్ల వేణుబాబు తెలిపారు. కౌన్సిలర్లు, అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

వైసీపీ హయాంలోనే షిఫ్ట్ ఆపరేటర్ తొలగింపు

● టీడీపీ నేతల ఆరోపణ

సత్తెనపల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలోనే మంత్రి అంబటి రాంబాబు విద్యుత్ శాఖలో పని చేసే షిఫ్ట్ ఆపరేటర్లను తొలగించారని టీడీపీ నేతలు నాగోతు శౌరయ్య, ఆళ్ల అమరేశ్వరరావు, కల్లం విజయ భాస్కర్‌రెడ్డి, చిన్నబోయిన రాఘవ, యర్ర వెంకటేశ్వరరావులు ఆరోపించారు. శుక్రవారం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కొమెరపూడి విద్యుత్ సబ్ స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్ల తొలగింపుపై వైసీపీ నేతలు అంబటి రాంబాబు, డాక్టర్ సుధీర్ భార్గవ్‌రెడ్డిలు హంగామా చేసి సమస్యను తప్పుదోవ పట్టించారన్నారు. ముప్పాళ్ళ మండలంలో రమేష్ అనే షిఫ్ట్ ఆపరేటర్‌ను వైసీపీ హయాంలో తొలగిస్తే అతని తల్లి ఆత్మహత్యకు ప్రయత్నించిదన్న విషయం నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసునన్నారు. రమేష్‌ను తొలగించి అతని జీతం నగదును వైసీపీ నేతలు కాజేశారన్నారు. టీడీపీ ప్రభుత్వంలో ఉద్యోగులెవరినీ తొలగించలేదన్నారు. రమేష్‌కు ఉద్యోగ అవకాశం కల్పించామన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అంబటి రాంబాబు పలువురు దగ్గర డబ్బులు తీసుకున్నట్టు ఆధారాలు, సాక్షాలు తమ దగ్గర ఉన్నాయన్నారు. అంబటి విమర్శలు మానుకోకపోతే ప్రజలే బుద్ధి చెపుతారని హెచ్చరించారు.

నేడు విజయవాడలో స్ఫూర్తి విముక్తి బహిరంగ సభ

రెంటచింతల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండల బీజేపీ నేతృత్వంలో శుక్రవారం సంచార, అర్ధసంచార జాతుల దినోత్సవానికి సంబంధించి వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ నేతృత్వంలో శనివారం విజయవాడలో స్ఫూర్తి విముక్త బహిరంగసభ జరుగుతుందన్నారు. మండల బీజేపీ అధ్యక్షుడు బి.నాగిరెడ్డి, సీనియర్ నేత పోకూరి కాశీపతి, పల్నాడు జిల్లా ఓబీసీ ప్రధాన కార్యదర్శి బి.రాంబాబు, గోవర్ధనచారి, సురేష్, పి.భారతి, కుమార్ పాల్గొన్నారు.

● దుర్గి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): సంచార జాతులు సంస్కృతికి వారధులు అని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి రాంబాబు అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన దుర్గి బేడ బుడగ జంగాల కాలనీలో ఏర్పాటు చేసిన సంచార జాతుల విముక్తి దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కప్పెర పెద్దిరాజు, పోకూరి కాశీపతి, కప్పెర లక్ష్మి, మన్నెయ్య పాల్గొన్నారు.

సిగ్నల్స్ ఆధారంగా వ్యక్తి ఆచూకీ కనుగొన్న పోలీసులు

● కుటుంబ సభ్యులకు అప్పగింత

మాచవరం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): సెల్ ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా తప్పి పోయిన వ్యక్తిని కనిపెట్టి మాచవరం పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీనికి సంబంధించి ఎస్ఐ తిరుపతిరావు శుక్రవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పిన్నెల్లి గ్రామానికి చెందిన షేక్ పట్లవీటి సైదా జూన్ 12వ తేదీన కన్పించకుండా ఇల్లు వదిలి వెళ్ళిపోయాడు. అతని తండ్రి షేక్ పట్లవీటి చినబుడే అదే రోజున పోలీసులకు ఫిర్యాదు చేశారు. సెల్ ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా తెనాలిలో ఉన్నట్టు గుర్తించి అక్కడకు వెళ్ళి పోలీసులు సైదాను అదుపులోకి తీసుకొని మాచవరం పోలీసు స్టేషన్‌కు తీసుకు వచ్చారు. అనంతరం తల్లిదండ్రులను పిలిపించి వారికి అప్పగించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ దుర్గారావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

దేవస్థాన భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు : ఈవో

మాచర్ల టౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): దేవస్థాన భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈవో పూర్ణచంద్రరావు అన్నారు. పట్టణంలోని బైపాస్ సమీపంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయ భూములను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈవో పూర్ణచంద్రరావు మాట్లాడుతూ సర్వే నెంబరు 404లో మూడెకరాల దేవదాయ శాఖ భూమిలో కొందరు మట్టి పోసి చదును చేసి వెంచర్లు ఏర్పాటు చేశారని, సమాచారం తెలుసుకొని పరిశీలించినట్లు చెప్పారు. దీనిపై విచారణ జరుపుతున్నామన్నారు. కొందరు అర్చకులు దేవస్థాన భూములు విక్రయించినట్లు తమ దృష్టికి వచ్చిందని, దీనిపై విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట దేవదాయ శాఖ సిబ్బంది ఉన్నారు.



దేవస్థాన భూములను పరిశీలిస్తున్న ఈవో పూర్ణచంద్రరావు

హరికృష్ణకు ఘనంగా నివాళి

సత్తెనపల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మాజీ రాజ్యసభ సభ్యుడు నందమూరి హరికృష్ణ వర్ధంతిని శుక్రవారం టీడీపీ ప్రజా వేదికలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో టీడీపీ నేతలు, కార్యకర్తలు నిర్వహించారు. హరికృష్ణ చిత్రపటానికి కన్నా పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ నేతలు నాగోతు శౌరయ్య, ఎలినేడి రామస్వామి, చౌట శ్రీనివాసరావు, దరువూరి నాగేశ్వరరావు, మక్కపాటి రామచంద్రరరావు, మస్తాన్ వలి, కటకం రామకృష్ణ, బలిజేపల్లి సురేష్ కుమార్, బంగారు నాగరాజు, పచ్చా సుధీర్, పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

● బెల్లంకొండ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం నందమూరి హరికృష్ణ వర్ధంతిని నిర్వహించారు. ముఖ్య అతిథిగా టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్ హాజరై హరికృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వృద్ధులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు లక్ష్మీనారాయణ, సర్పంచ్ జ్యోతి సముద్రం, సయ్యద్ జానీ, పీఎస్‌కే రసూల్, వైస్ సర్పంచ్ రజాక్, తదితరులు పాల్గొన్నారు. మండలంలోని నాగిరెడ్డిపాలెంలో మండల కోర్ కమిటీ సభ్యులు వెన్నా సీతారామిరెడ్డి ఆధ్వర్యంలో హరికృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● నకరికల్లు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): నకరికల్లు టీడీపీ కార్యాలయంలో శుక్రవారం టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు నందమూరి హరికృష్ణ వర్ధంతిని నకరికల్లు టీడీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ఆకుల పెద వెంకటేశ్వర్లు, షేక్ మహమస్తా, మైలవరపు కాశీ, తిరుమలశెట్టి వెంకటరరావు, పౌలు, సంగుల అప్పారావు, దూదేకుల హుస్సేన్ బీ, గుజ్జుల పౌలు, కిషోర్ పాల్గొన్నారు.

పాడుబడ్డ బావిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

దుర్గి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడిగొప్పుల గ్రామ శివారులోని పాడుబడ్డ బావిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మృతుడు సుమారు 50 సంవత్సరాలు వయసు కలిగి ఫుల్ హ్యాండ్స్ తెల్లని చొక్కా, ఎరుపు రంగు లుంగీపై తెలుపు, పచ్చ రంగు పూలు ఉన్నాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుధీర్‌కుమార్ తెలిపారు.

వరకట్న వేధింపుపై కేసు

గురజాలటౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): వరకట్న వేధింపుపై గురజాల పోలీస్‌స్టేషన్లో కేసు నమోదైంది. మండలంలోని దైద గ్రామానికి చెందిన బాణావత్ సీతమ్మ బాయి, రమావత్ నాగార్జునకు 2016వ సంవత్సరంలో వివాహం జరిగింది. భర్త, అతని కుటుంబ సభ్యులు అదనపు కట్నం తీసుకురావాలని మానసికంగా, శారీరకంగా వేధించడంతో పోలీసులకు ఆశ్రయించారు.

స్త్రీశక్తి.. విజయోత్సాహం

● కారంపూడి సభకు తరలివచ్చిన మహిళలు
● మహిళా సంక్షేమమే ధ్యేయమన్న మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యే జూలకంటి



సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యే జూలకంటి

కారంపూడి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ - సూపర్‌హిట్‌లో భాగంగా శుక్రవారం కారంపూడిలోని ఆర్అండ్‌బీ బంగ్లా ఎదుట శుక్రవారం జరిగిన స్త్రీశక్తి(మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణం) విజయోత్సవ సభ అట్టహాసంగా జరిగింది. నియోజకవర్గ వ్యాప్తంగా ఎనిమిది వేల మందికిపైగా మహిళలు తరలివచ్చి తమ అభిమానాన్ని చాటుకున్నారు. స్థానిక ఇందిరాగాంధీ బొమ్మ సెంటర్ వద్ద గజమాలతో మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డిలకు స్వాగతం పలికాయి. సభలో సుగాలీల నృత్యం ఆకట్టుకుంది. మహిళల కోలాటం ఆకర్షణీయంగా నిలిచింది. సభా వేదికపై గర్భిణీలకు సీమంతం నిర్వహించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ మహిళల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆనాడు ఎన్టీఆర్ నాయకత్వంలో ఆడబిడ్డలకు ఆస్తిలో సమాన హక్కు, స్థానిక సంస్థలో రిజర్వేషన్, విద్యా, ఉద్యోగ అవకాశాల్లో సమానత్వం, మహిళా యూనివర్సిటీ వంటి అనేక సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. అదే బాటలో ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా తల్లికి వందన, దీపం పథకం, వితంతు పింఛన్, డ్వాక్రా సంఘాలు ఏర్పాటు, స్త్రీశక్తి పేరుతో రాష్ట్రమంతటా ఉచిత ప్రయాణం వంటి సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ఆర్థిక ప్రగతికి బాటలు వేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు గాడిపర్తి రమాదేవి, బొల్నేడి కనకదుర్గ, చప్పిడి రాము, టీడీపీ మండల అధ్యక్షుడు గోళ్ల సురేష్ యాదవ్, మాజీ అధ్యక్షుడు ఉన్న లక్ష్మీనారాయణ, బొల్నేడి శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షుడు బొమ్మిన శేషగిరిరావు, మాజీ అధ్యక్షుడు కలికల బాలకృష్ణ, తండా మస్తాన్‌జాని, బొల్నేడి హరికృష్ణ, ఒప్పిచర్ల లక్ష్మయ్య, సత్యం, నరమాలపాడు సత్యనారాయణ, లింగాల శ్రీనివాసరావు, జక్కా నరసింహారావు, తెలుగు మహిళా అధ్యక్షురాలు నాగలక్ష్మీరెడ్డి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టి హనుమంతురావు, కజ్జం పెద ఆంజనేయులు, టీడీపీ సీనియర్ నేత కర్ల సైదారావు, మాజీ సర్పంచ్ దోర్నాల నాగిరెడ్డి, నున్న జనార్ధన్, జనసేన నియోజకవర్గ కన్వీనర్ బూసా రామాంజినేయులు, సొసైటీ అధ్యక్షుడు నాగవరపు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మాచర్లకు మరింత సాయం

మాచర్ల టౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన మాచర్ల నియోజకవర్గానికి కూటమి ప్రభుత్వం ద్వారా మరింత సాయం అందుతోందని రాష్ట్ర విద్యుత్ శాఖ, పల్నాడు జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. కారంపూడిలోని ఆర్అండ్‌బీ బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణం, సోలార్, విండ్ విద్యుత్ ఉత్పత్తికి నిధులు కేటాయిస్తామన్నారు. మాచర్ల నియోజకవర్గానికి 10 వేల సోలార్ కనెక్షన్లు అందిస్తామని, రానున్న రోజుల్లో విద్యుత్ ఉత్పత్తిలో పల్నాడు జిల్లా ముందుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే పల్నాడు జిల్లాలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల దొంగలను గుర్తించి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతోపాటు రికవరీ యాక్ట్‌తో కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు.

దమ్ము చక్రాలతో రోడ్డుపైకి వస్తే సీజ్ చేయండి

రైతులు మగాణి భూముల్లో దమ్ము చేసేందుకు ఉపయోగించే చక్రాలతో రోడ్డుపైకి వచ్చే ట్రాక్టర్లను సీజ్ చేయాలని మాచర్ల మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ శేషిరెడ్డిని మంత్రి గొట్టిపాటి ఆదేశించారు. రోడ్ల నిర్మాణాలు చేపట్టిన ఆరు నెలలకే రోడ్లు పాడైపోతున్నాయన్నారు. సమావేశంలో శిల్పారామం, హస్తకళల అభివృద్ధి చైర్మన్ మంజులారెడ్డి, పంగులూరి పుల్లయ్య, విద్యుత్ శాఖ ఈఈ సింగయ్య, ఏడీఈ వీరేశ్వరరావు, ఇన్‌చార్జి ఏఈ వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సాగర్ ప్రాజెక్టును సందర్శించిన మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యే జూలకంటి



ప్రాజెక్టును సందర్శిస్తున్న మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యే జూలకంటి

విజయపురి సౌత్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్టును విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, మాచర్ల శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి శుక్రవారం సందర్శించారు. సాగర్ నూతన బ్రిడ్జి వద్ద నుంచి సాగర్ డ్యాం 26 క్రస్ట్ గేట్ల నుంచి విడుదలయ్యే నీటిని వీక్షించారు. ఈ యేడాది సాగర్ ప్రాజెక్టుకు ముందుగానే వరద వచ్చి నీటిని దిగువకు విడుదల చేయడం శుభపరిణామని మంత్రి రవికుమార్ అన్నారు. వీరి వెంట టీడీపీ యువనేత జూలకంటి అక్కిరెడ్డి, చిరంజీవిరెడ్డి పాల్గొన్నారు.

గణనాథుని విగ్రహాల వద్ద కన్నా పూజలు



కొత్తపేటలో గణనాథుని సందర్శించి పూజలు చేసిన ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వివిధ వార్డుల్లో వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా మండపాల్లో ఏర్పాటు చేసిన గణనాథులను శుక్రవారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, టీడీపీ నేతలు సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. కొత్తపేట భావన రుషినగర్, గాంధీ బొమ్మ సెంటర్, అచ్చంపేట రోడ్డు, పాత బస్టాండ్ ఏరియా తదితర ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన గణనాథులను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, టీడీపీ నేతలు సందర్శించారు. గాంధీ బొమ్మ సెంటర్, పాత బస్టాండ్ ఏరియాలో గణపతి నవరాత్రి ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమంలో కన్నా లక్ష్మీనారాయణ, టీడీపీ నేతలు అన్నదానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ఎలినేడి రామస్వామి, చౌట శ్రీనివాసరావు, దరువూరి నాగేశ్వరరావు, మస్తాన్‌వలి, నూర్‌బాషా జాన్‌బాబు, పూజల వెంకట కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

● మాచర్ల రూరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బొమ్మరిల్లు అపార్ట్‌మెంట్ వద్ద వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద శుక్రవారం ప్రత్యేక పూజలు జరిపారు. మున్సిపల్ చైర్మన్ షేక్ మదార్‌సాహెబ్, వైస్ చైర్‌పర్సన్ యర్రాకుల సిద్ధమ్మ, సిద్ధయ్య యాదవ్, కమిషనర్ ధూళిపాళ్ల వేణుబాబులు పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కొత్తమాసు పాండురంగారావు, ప్రసాదరావు, పమ్మి శ్రీనివాసరెడ్డి, మురళి తదితరులు పాల్గొన్నారు.

● మాచవరం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం గణేష్ లడ్డూ వేలం కోలాహలంగా నిర్వహించారు. చెన్నాయపాలెంలో గణపతి దేవాలయం వద్ద నిర్వహించిన లడ్డూ వేలంను మూటపోతుల బాల గంగిరాజు, దత్తు నాయక్ రూ.20వేలకు, రేణుక అమ్మవారి దేవాలయం వద్ద లడ్డూను జుజ్జూరి గోకుల్ చౌదరి రూ.20వేలకు, ఆంజనేయస్వామిగుడి వద్ద లడ్డూను సపావత్ చిన్నా నాయక్ రూ.26వేలకు కైవసం చేసుకున్నారు. ఆయా దేవాలయాల వద్ద తంగెడ గ్రామ పురోహితుడు జానపాటి సీతారామ శర్మ లడ్డూ వేలం నిర్వహించారు.

● రెంటచింతల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన విఘ్నేశ్వరుడి విగ్రహాల ఊరేగింపు సందడిగా సాగింది. మినీ లారీ, ట్రాలీ, ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో 12 కేజీల లడ్డూ వేలంలో టీడీపీ టౌన్ అధ్యక్షుడు మూలి రాజారెడ్డి రూ.42వేలకు పాడుకున్నట్లు నిర్వాహకులు మౌలాలి చెప్పారు. అలాగే శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో పరమేశ్వరీ యువ గణేష్ ఆధ్వర్యంలో 23కేజీల లడ్డూ, 26 గ్రాముల వెండిలాకెట్, 2 గ్రాముల గోల్డ్‌ను కొత్తసందీప్‌కుమార్ రూ.60వేలకు పాట పాడి దక్కించుకున్నట్లు శివ చెప్పారు.

● బెల్లంకొండ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం గణేష్ నిమజ్జనాలు వైభవంగా నిర్వహించారు. పాపాయపాలెం, నాగిరెడ్డిపాలెం, చంద్రాజుపాలెం గ్రామాల్లో వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. ఎస్ఐ ప్రవీణ్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

● మాచర్ల టౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పీడబ్ల్యూడీ కాలనీలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయకుని మండపం వద్ద శుక్రవారం ప్రత్యేక పూజలు జరిపారు. ఈ పూజల్లో టీడీపీ సీనియర్ నేత యెనుముల కేశవరెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. అలాగే పట్టణంలోని 11, 13, 22 వార్డుల్లోనూ పూజల్లో పాల్గొని అన్నదానం ప్రారంభించారు. కార్యక్రమంలో నర్రా గురవారెడ్డి, గర్నె శ్రీను, రాము, శంకర్, జగడాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

● నకరికల్లు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : నకరికల్లులోని చౌత్ర సెంటర్‌లో, ఎన్ఎస్‌పీ కాలనీలో, దేవవరంలో తొమ్మిది ప్రాంతాల్లో, కుంకలగుంటలో నాలుగు చోట్ల వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు నిర్వహిస్తున్నారు.

● గురజాలటౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముత్యాలమ్మ గుడి సెంటర్ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహాన్ని శుక్రవారం నిమజ్జనం చేశారు. 11 కేజీల లడ్డు ప్రసాదానికి వేలం నిర్వహించగా రూ.65 వేలకు నల్ల నవీన్ దక్కించుకున్నారు.

● దాచేపల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లిలోని శ్రీ వీర్లంకమ్మ తల్లి దేవాలయంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో మండలంలోని కూటమి నేతలు ముఖ్య అతిథిగా హాజరై పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. టీడీపీ యూత్ నాయకులు కొప్పుల గిరీష్ కుమార్ ఆధ్వర్యంలో గణపతికి ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తంగెళ్ళ శ్రీనివాసరావు, బెల్లంకొండ బద్రి, పగడాల భాస్కరరావు, ఎంపీటీసీ వలి, బొమ్మిరెడ్డి నారాయణ, మునగ నిమ్మయ్య, పాముల కిషోర్, కొప్పుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● ముప్పాళ్ళ ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): వినాయకుని నిమజ్జనాన్ని భక్తులు శుక్రవారం కోలాహలంగా నిర్వహించారు. తీన్‌మార్ డప్పులతో, ఊరేగింపుగా తరలివెళ్ళి నిమజ్జనం చేశారు. మండలంలోని అన్ని గ్రామాలలో 13 విగ్రహాలను భక్తులు నిమజ్జనం చేసినట్లు ఎస్ఐ సోమేశ్వరరావు తెలిపారు.

వినాయకుని లడ్డూ రూ.6.40 లక్షలు



వినాయకుని లడ్డూను పాడుకున్న సత్యనారాయణరెడ్డి

రెంటచింతల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రెంటచింతలలోని శ్రీసాయి గణేష్ యూత్ (ఆనందపేట) ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి వినాయకుని లడ్డూ వేలంను కోలాహలం నడుమ నిర్వహించారు. ఇగుటూరి సత్యనారాయణరెడ్డి 90 కేజీల లడ్డూను రూ.6.40లక్షలకు పాడుకున్నారు. అందులో 30 గ్రాముల బంగారం కూడా ఉంచారు. ఎస్ఐ సీహెచ్ నాగార్జున నేతృత్వంలో పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.

రూ.1.05 లక్షలకు లడ్డూ వేలం

పిడుగురాళ్ల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 2వ వార్డులో శ్రీ గణపతి సేవా సమితి 12వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద లడ్డూకు శుక్రవారం వేలం నిర్వహించారు. గుదె రవిబాబు 27 కేజీల లడ్డును లక్షా 5వేల రూపాయలకు వేలంలో దక్కించుకున్నట్లు కమిటీ నిర్వాహకులు తెలిపారు. సినిమాహాలు సెంటర్‌లో రెడ్డి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద 36 కేజీల లడ్డును పిల్లుట్లకు చెందిన దొండేటి వెంకటరెడ్డి రూ.60 వేలకు దక్కించుకున్నారు. అనంతరం విగ్రహాన్ని మేళతాళాలతో నిమజ్జనానికి తరలించారు.

● పెదకూరపాడు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పెదకూరపాడు మండలంలోని బలుసుపాడులో వినాయకుని విగ్రహానికి శుక్రవారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు నుదురుపాటి శర్మ, మాజీ సర్పంచ్ బచ్చు హనుమంతరావు, మారెళ్ళ కోటేశ్వరరావు, ఎల్‌వీసీ హనుమంతరావు, అంబటి వెంకట నరసింహారావు, మందపల్లి సుబ్బారావు, ఏపూరి శివయ్య తదితరులు పాల్గొన్నారు.

తెలుగు కమ్మనైన భాష : హెచ్‌ఎం

రెంటచింతల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తెలుగు కమ్మనైన భాష అని, ప్రతి విద్యార్థి తెలుగు మాధుర్యాన్ని తెలుసుకోవాలని మంచికల్లు జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం సిలార్ అహ్మద్ కోరారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో తెలుగు భాష దినోత్సవాన్ని అలాగే క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని గిడుగు రామూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు ఘనంగా నివాళులర్పించారు. తెలుగు టీచర్ శారదను ఘనంగా సన్మానించారు.

● కారంపూడి: స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గిడుగు వెంకట రామమూర్తి జయంతిని పురస్కరించుకొని శుక్రవారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం పుల్లమ్మ విద్యార్థులకు తెలుగు భాష విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో బాలసాహితీవేత్త మాన్‌సింగ్‌నాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● మాచర్ల టౌన్: మాతృభాషను కాపాడుకోవడం మనందరి బాధ్యతని లయన్స్ క్లబ్ ఆఫ్ మాచర్ల చెన్నకేశవ డిస్ట్రిక్ చైర్మన్ డాక్టర్ కమలాసనరావు అన్నారు. గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక విద్య అంతా తెలుగులోనే జరగాలన్నారు.

● పిడుగురాళ్ల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణపల్లి సమీపంలోని గీతిక సీబీఎస్ఈ పాఠశాలలో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులు తెలుగు భాష ఆకృతిలో కూర్చున్న విధానం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ తాళ్లపల్లి బాలగంగాధరరెడ్డి, వైస్‌చైర్మన్ తాళ్లపల్లి పద్మశ్రీ, డైరెక్టర్ తాళ్లపల్లి వెంకట్రామిరెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు. తుమ్మల చెరువు సమీపంలోని బోధి పాఠశాలలోనూ తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ సునీతారెడ్డి పాల్గొన్నారు.

● విజయపురిసౌత్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏపీఆర్‌డీసీలో శుక్రవారం తెలుగు బాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నయీంబాను విద్యార్థులకు తెలుగుబాష విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ రత్నశేఖర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

● దాచేపల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి ఆదర్శ పాఠశాలలో శుక్రవారం తెలుగు బాషా దినోత్సవాన్ని, క్రీడా దినోత్సవాన్ని జరుపుకున్నారు. క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు 5వ వార్డు కౌన్సిలర్ బొమ్మనబోయిన నాగరాజు రూ.9 వేల ఆర్థిక సాయంతో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రవి కుమార్, ఇతర ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● సత్తెనపల్లి ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అమరావతి పబ్లిక్ స్కూల్‌లో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ సూర్యదేవర శ్రీనివాసరావు తెలుగు భాషా సంస్కృతి సంప్రదాయాలను విద్యార్థులకు వివరించారు. తెలుగు పదం అక్షరరూపంలో విద్యార్థులు కూర్చుని ఆకట్టుకున్నారు. విద్యార్థులు నాటికలు, పద్యాల పఠనం, తెలుగు నాట్యాల వంటి సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. విద్యా కేంద్రం స్కూల్‌లో కూడా తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

1న పిడుగురాళ్లలో స్త్రీ శక్తి మహాసభ

● ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు 1వ తేదీ చరిత్రలో గుర్తుండిపోయేలా స్త్రీ శక్తి మహా సభను నిర్వహిస్తామని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం పిడుగురాళ్ల మార్కెట్ యార్డులో గురజాల నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే యరపతినేని మాట్లాడుతూ సెప్టెంబరు 1వ తేదీన పిడుగురాళ్లలో 30వేల మంది మహిళలతో స్త్రీ శక్తి మహాసభ నిర్వహించనున్నామని ముఖ్యఅతిధులుగా హోంమంత్రి అనిత, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, గుంటూరు-2 ఎమ్మెల్యే గల్లా మాధవి ముఖ్యఅతిధులుగా హాజరుకానున్నారన్నారు. సభ్యత్వ నమోదులో గురజాల నియోజకవర్గం 4వ స్థానం, సుపరిపాలన తొలిఅడుగులో మూడవ స్థానంలో ఉందని, గ్రామస్థాయిలో టీడీపీ శ్రేణులు అందరూ కలిసి పనిచేసినప్పుడే మంచి ఫలితాలు వస్తాయన్నారు. మరో 15 ఏళ్లపాటు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వమే అధికారంలో వుంటుందని, కలిసే పనిచేస్తామని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చెప్పిన మాటలను ఎమ్మెల్యే యరపతినేని ప్రస్తావించారు. మహిళలపై సోషల్ మీడియాలో అసభ్యంగా పోస్టులు పెట్టే వారిని ఉపేక్షించేది లేదని, తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. అనంతరం 1వ తేదీన జరుగనున్న స్త్రీ శక్తి మహాసభ విజయవంతంపై పార్టీ శ్రేణులు, మహిళలతో ఎమ్మెల్యే యరపతినేని సమీక్ష నిర్వహించారు. జానపాడు రోడ్డులో లోకేశ్ యువగళం పాదయాత్ర సందర్భంగా ఏర్పాటు చేసిన సభా ప్రదేశంలోనే స్త్రీ శక్తి మహాసభ నిర్వహించడం జరుగుతుందన్నారు. సమావేశంలో నాగార్జునసాగర్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పులుకూరి కాంతారావు, మున్సిపల్ చైర్మన్ కెవి సుబ్బారావు, నియోజకవర్గ పరిశీలకులు విజయభాస్కర్‌రెడ్డి, యువనాయకులు యరపతినేని నిఖిల్, డాక్టర్ వున్నం నాగమల్లిఖార్జునరావు, షేక్ బాబావలి, పాండురంగ శ్రీను, గండికోట వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా సీఎం సహాయనిధి

సత్తెనపల్లి ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి బాధితులకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం సీఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందించారు. సత్తెనపల్లి మండలం నందిగామకు చెందిన జి.శ్రీనివాసరావుకు రూ.లక్ష 6వేల 239, రెంటపాళ్ళకు చెందిన ఎస్.జస్వంత్‌కు రూ.79,698, సత్తెనపల్లికి చెందిన ఎస్.అమరవాణికి రూ.62,729, రాజుపాలెం మండలం కోట నెమలిపురికి చెందిన వి.రామయ్యకు రూ.58,714 చెక్కులను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో మక్కపాటి రామచంద్రరావు, ఆళ్ళ అమరేశ్వరరావు, నూర్‌బాషా జానీబాబు, పూజల వెంకట కోటయ్య, గుజ్జర్లపూడి స్టాన్లీ, పి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చంద్రబాబు నాయుడును కలిసిన కన్నా

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలిసిన ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ గురువారం రాత్రి ఉండవల్లిలోని ఆయన గృహంలో కలిశారు. నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చంద్రబాబు నాయుడుతో కన్నా లక్ష్మీనారాయణ చర్చించారు.

క్రోసూరులో డీఈ కార్యాలయం ఏర్పాటుకు ఉత్తర్వులు



ఎమ్మెల్యే ప్రవీణ్

పెదకూరపాడు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా విభజన తరువాత పెదకూరపాడు నియోజకవర్గంలోని అమరావతి, అచ్చంపేట, క్రోసూరు, పెదకూరపాడు మండలాలను నరసరావుపేట డివిజన్‌లో కలిపి అక్కడి నుంచి విద్యుత్ కార్యకలాపాలను నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తెలిపారు. గుంటూరులోని పెదకూరపాడు నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే ప్రవీణ్ మాట్లాడుతూ ఇటీవల నాలుగు మండలాలను చిలకలూరిపేట డివిజన్‌లో కలపాలని అధికారులు నిర్ణయించారన్నారు. ప్రజల అవసరాలను తీర్చుకొనేందుకు చిలకలూరిపేట వెళ్ళటం కష్ట మవుతుందని, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు లేఖలో వివరించినట్టు ప్రవీ ణ్ తెలిపారు. నరసరావుపేట డివిజన్ నుంచి నూతనంగా సత్తెనపల్లి రూరల్ సబ్ డివిజన్ కార్యాలయాన్ని ఏర్పాటుచేసి అక్కడి నుంచి విద్యుత్ కార్యకలాపాలను నిర్వహించాలని మంత్రి ఆదేశాలు జారీచేశారని తెలిపారు. సత్తెనపల్లి రూరల్ సబ్ డివిజన్ ఏర్పాటు చేస్తూ విద్యుత్ శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారని వివరించారు. సబ్ డివిజన్‌ను ఏర్పాటు చేసిన కూటమి ప్రభుత్వం, మంత్రి రవి కుమార్‌కు, ఆ శాఖ అధికారులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

విద్యార్థులు చదువుతోపాటు క్రీడలలో రాణించాలి

సత్తెనపల్లి ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడలలో రాణించాలని ఆర్డీవో రమణ కాంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని రామకృష్ణాపురం వద్ద ఉన్న పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయంలో శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. క్రీడలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆర్డీవో రమణ కాంత్‌రెడ్డి బాడ్జీలను బహూకరించారు. ముందుగా ధ్యాన్‌చంద్ చిత్రపటానికి ఆర్డీవో, తహసీల్దార్ చక్రవర్తి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గుప్త, పీఈటీ, అధ్యాపకులు, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

● పెదకూరపాడు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్, తెలుగు బాషా వ్యవహారిక బాష ఉద్యమ పితామహులు గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు జయంతి నిర్వహించారు. జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కాకాని వెంకట రమణ వివిధ పోటీల్లో విజేతలకు ప్రోత్సాహక బహుమతులను అందించారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

దాచేపల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): చిన్న వయస్సులో పిల్లలకు పెళ్ళిళ్ళు చేయటం సరి కాదని, వారిని చదివించి మంచి భవిష్యత్తు కలిగించాలని సీనియర్ సివిల్ జడ్జి వై శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం జాతీయ రాష్ట్ర సేవా సంస్థల ఆదేశాలతో న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఘంటా ప్రియదర్శిని దాచేపల్లి ఎస్సీ కాలనీలో న్యాయ అవగాహన సదస్సు జరిగింది. బాల్య వివాహాలు, గర్భధారణ, వాటి దుష్ప్రభావాలపై స్థానికులకు వివరించారు. జనరల్ సెక్రటరీ కేచలమరాజు, ప్యానల్ లాయర్ జానీ బాషా, సీడీపీవో సూపర్‌వైజర్ పలు విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాదులు క్షేప్రభుదాసు, జ్ఞాన సుందరి, కనకరాజు, అంగన్‌వాడీ వర్కర్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగుతేజం పురస్కారానికి శ్రీనివాసరెడ్డి ఎంపిక

పెదకూరపాడు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 75 తాళ్ళూరు జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి తెలుగుతేజం పురస్కారానికి ఎంపికైనట్టు అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ ప్రకటించినట్టు శ్రీనివాసరెడ్డి శుక్రవారం తెలిపారు. ఈనెల 31న నరసరావుపేటలో గిడుగు రామ్మూర్తి జయంతి తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని జరిగే కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అందుకోనున్నట్టు ఆయన తెలిపారు.

రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలి

క్రోసూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రైతులకు యూరియా కొరత లేకుండా అధికారులు జాగ్రత్తలు వహించాలని సీపీఎం జిల్లా నాయకులు గంజిమాల రవిబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం క్రోసూరులోని వ్యవసాయ మార్కెట్ యార్డు, మన గ్రోమోర్, క్రోసూరు సొసైటీ, రైతు సేవా కేంద్రాల గిడ్డంగులను సీపీఎం నాయకులు పరిశీలించారు. ఏసయ్య, ఏపూరి వెంకటేశ్వర్లు ఉన్నారు.

రహదారిపై దమ్ము చక్రాలతో తిరిగితే కఠిన చర్యలు : ఎస్ఐ

కారంపూడి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ప్రధాన రహదారులపై దమ్ము చక్రాలతో ట్రాక్టర్లు తిరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ వాసు అన్నారు. శుక్రవారం దాచేపల్లి రహదారిలో దమ్ము చక్రాలతో వెళ్తున్న రెండు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నామన్నారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శేషిరెడ్డి ట్రాక్టర్ డ్రైవర్లకు రూ.2వేల జరిమానా విధించారన్నారు.









రూ.77,77,777..

పెదనందిపాడు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): గణేష్ నవరాత్రుల్లో భాగంగా..లంబోదరుడికి వివిధ అలంకరణలతో భక్తులు పూజలు నిర్వహిస్తున్నారు. నాగులపాడులో శ్రీ రామ యూత్ ఆధ్వర్యంలో 15 వార్షికోత్సవం సందర్భంగా గణనాథుడిని రూ.77,77,777ల నగదుతో ప్రత్యేకంగా అలంకరించారు.

గాజువాక గణపతికి.. భారీ లడ్డూ నివేదన

తెనాలి అర్బన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలోని గాజువాకలో లక్ష చీరలతో చేసిన గణపతికి నైవేద్యంగా భారీ లడ్డూని తెనాలిలోని చెంచుపేట శ్రీ మాతా ఫుడ్ ప్రొడక్ట్స్ యజమాని ఉప్పల నంద కిషోర్ చేయించారు. రెండు వేల కేజీల బరువు కలిగిన ఈ లడ్డూని శివలింగం ఆకృతిలో .. ఎనిమిది అడుగుల ఎత్తులో 15 మంది నిపుణులు నాలుగు రోజులు శ్రమించి తయారు చేశారు. ఇంత భారీ సైజులో గణపతికి లడ్డూ ప్రసాదం నివేదన చేయడం..గిన్నిస్ రికార్డు సాధించేందుకు అవకాశం ఉంటుందని మిఠాయి దుకాణం యజమాని అభిప్రాయపడుతున్నారు. లడ్డూని గాజువాక తరలించేందుకు శుక్రవారం ఏర్పాట్లు చేశారు.

'ధన'పతి

● రూ 22 లక్షల కరెన్సీతో విఘ్నేశ్వరునికి విశేష అలంకారం

నరసరావుపేట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట కాకతీయ నగర్‌లోని శ్రీ సాయిరామ్ టవర్స్ అపార్ట్‌మెంట్‌లో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహానికి శుక్రవారం రూ.22 లక్షల నగదుతో విశేష అలంకారం గావించారు. స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రూ.2.35 కోట్ల నగదే.. తోరణాలు, పుష్పాలు

మంగళగిరి సిటీ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మెయిన్ బజారులో ఏర్పాటు చేసిన గణనాథుడిని శుక్రవారం రూ.2.35కోట్ల నగదుతో ప్రత్యేకంగా అలంకరించారు. స్థానిక వ్యాపారుల సహకారంతో ఈ ఏడాది భారీ గణనాథుని విగ్రహాన్ని ఏర్పాటుచేసి ధన గణపతిగా అలంకరించారు. పూల మార్కెట్ సెంటరులోని కస్తూరి కంగన్ హాలు వద్ద ఏర్పాటు చేసే ఈ వినాయకుడిని ఏటా కరెన్సీ నోట్లతో ప్రత్యేకంగా అలంకరిస్తారు. 19 ఏళ్ల నుంచి సంకా బాలాజీ గుప్తా బ్రదర్స్ ఆధ్వర్యంలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ఇక్కడ ఘనంగా నిర్వహిస్తున్నారు. రూపాయి నోటు దగ్గరి నుంచి రూ.500 కరెన్సీ నోట్లతో పువ్వులు, తోరణాలను తయారు చేసి అలంకరించారు.



ద్యానబుద్ధ ప్రాంగణంలో త్రివిధ దళాల బృందంతో స్థానిక అధికారులు

బుద్ధుడి చూపిన మార్గంలో.. త్రివిధ దళాల బైక్ ర్యాలీ

అమరావతి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): గౌతమ బుద్ధుడు అందించిన శాంతి, కరుణ, దయ మార్గాలను నలు దిశలా వ్యాప్తి చేసేందుకు భారత త్రివిధ దళాల అధికారులు ఆరుగురు శుక్రవారం అమరావతిలో బైక్ ర్యాలీ నిర్వహించారు. వైజాగ్‌లో ప్రారంభమై.. ఈ బుద్ధ సర్క్యూట్ ర్యాలీ రాజమండ్రి, విజయవాడ, అమరావతి, ఒంగోలు, తిరుపతి, చిత్తూరు వరకు జరుగుతుంది. రాహుల్ పాటిల్ కన్వీనర్‌గా బిమ్‌స్టెక్ దేశాలకు చెందిన ప్రతినిధులు ఈ యాత్రలో పాల్గొన్నారు. అమరావతిలో ధ్యాన బుద్ధ ప్రాజెక్టు సందర్శించిన అనంతరం ర్యాలీని తహసీల్దార్ డానియేలు, సీఐ అచ్చియ్య, టూరిజం అధికారి నాయుడమ్మ, మేనేజర్ మణికుమార్ జెండా ఊపి ప్రారంభించారు. పురాతన, సాంస్కృతిక, ఆధ్యాత్మిక మార్గాలను పునఃఅన్వేషణకు బుద్ధ సర్క్యూట్ పేరుతో ఈ యాత్ర ఉపకరిస్తుందని రాహుల్ పాటిల్ పేర్కొన్నారు. ఈ యాత్రకు విదేశాంగ, గృహ మంత్రిత్వ శాఖలు, ల్యాండ్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, నలందా యూనివర్సిటీ, బిమ్‌స్టెక్ సెక్రటేరియట్ మద్దతు ఇవ్వడం ద్వారా భారతదేశం ఐక్యత, ప్రాంతీయ సాంస్కృతిక దౌత్యం పట్ల ఉన్న దృష్టిని ప్రతిబింబిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాజశేఖర్, ఆర్ఐ శిరోమణి పాల్గొన్నారు.

టీసీలే జనరల్ టిక్కెట్ ఇస్తారు

- రైల్వే బోర్డు ప్రత్యేక సాఫ్ట్‌వేర్
- చేతికి హ్యాండ్‌సెట్, చిన్న ప్రింటర్
- తప్పనున్న క్యూలైన్ కష్టాలు



హ్యాండ్‌సెట్, ప్రింటర్‌తో టీటీఈ

గుంటూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రైల్వేస్టేషన్లలో జనరల్ టిక్కెట్ కౌంటర్ల వద్ద రద్దీ నియంత్రణకు రైల్వే శాఖ ఏటీవీఎం, యూటీఎస్ వంటి ఆన్‌లైన్ సర్వీసులను అందుబాటులోకి తీసుకొచ్చినప్పటికీ నేటికీ ప్రధాన రైల్వేస్టేషన్లలో కౌంటర్ల వద్ద రద్దీ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో రైల్వే టిక్కెట్ తనిఖీ సిబ్బందికి ఒక హ్యాండ్‌సెట్, చిన్న ప్రింటర్‌ని ఇచ్చి ప్లాట్‌ఫాం వద్దనే జనరల్ టిక్కెట్‌లను జారీ చేసే బాధ్యతలు కేటాయించేందుకు సిద్ధమైంది. ఇప్పటికే కొన్ని ప్రధాన రైల్వేస్టేషన్లలో ట్రయల్ రన్ కూడా నిర్వహిస్తున్నారు. రాబోయే పండగల సీజన్‌లో రద్దీ పెరగనున్న దృష్ట్యా ఆలోపే టీటీఈలు జనరల్ టిక్కెట్‌లు జారీ చేసే సేవలను ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని రైల్వే శాఖ భావిస్తోంది. దీని వల్ల అటు ప్రయాణికులకు ఉపయోగకరంగా ఉండటంతో పాటు ఇటు రైల్వేకు ఆదాయం వస్తుంది.

క్యూలైన్ కష్టాలకు చెక్..

టీటీఈలు హ్యాండ్‌సెట్లు అందుబాటులోకి రాని రోజుల్లో చేతివాటం ప్రదర్శించేవారు. నేటికీ కొంతమంది ఈఎఫ్‌టీల విషయంలో ఇదే వైఖరిని కలిగి ఉన్నారు. దీని వల్ల రైల్వే శాఖ ఆదాయం కోల్పోతుంది. ఈ నేపథ్యంలో కొన్ని సంవత్సరాల నుంచి హ్యాండ్ సెట్ల విధానాన్ని రైల్వే శాఖ అందు బాటులోకి తీసుకొచ్చింది. దీనికి అదనంగా వైఫై/ బ్లూటూత్ సదుపాయంతో మెడలో ధరించే ఒక ప్రింటర్‌ని కనెక్టు చేసి వాటి ద్వారా జనరల్ టిక్కెట్లు జారీ చేసే సాఫ్ట్‌వేర్‌ని అభివృద్ధి చేసింది. ఈ సదుపాయం వల్ల ప్రయాణికులు టిక్కెట్ కౌంటర్ల వద్ద క్యూలైన్‌లో నిలబడకుండా నేరుగా టీటీఈ వద్దకు వెళ్లి ఎక్కడికి ప్రయాణించదలిచారో చెబితే వెంటనే నగదు చెల్లించుకొని జనరల్ టిక్కెట్ జారీ చేస్తారు. దీని వల్ల రైల్వేకు టిక్కెట్ కౌంటర్లు, యూటీఎస్ యాప్, ఏటీవీఎంలతో పాటు టీటీఈల ద్వారా కూడా ఆదాయం వస్తుంది.

సంపూర్ణ క్రమశిక్షణ వీవీఐటీయూ నినాదం




సరస్వతి దేవికి పూజలు చేస్తున్న వర్సిటీ చాన్సలర్ విద్యాసాగర్, విద్యార్థులు

● చాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్

పెదకాకాని, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మంచి నడవడికతో ఉంటే విజయం తప్పక వరిస్తుందని వీవీఐటీయూ విశ్వసిస్తుందని చాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్ అన్నారు. క్రమశిక్షణతో కూడిన అధునాతన విద్య, ఉపాధి, నైపుణ్యాలతో పాటుగా విద్యార్థులకు మంచి అనుభూతులను, జ్ఞాపకాలను విశ్వవిద్యాలయం అందిస్తుందని ఆయన పేర్కొన్నారు. కళాశాలలో 2025-26 ఏడాది విద్యార్థుల తరగతుల ప్రారంభ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రవేశ పరీక్షల్లో టాప్ ర్యాంకర్లుగా నిలిచి, ప్రవేశం పొందిన విద్యార్థులు జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లడుతూ వీవీఐటీ విశ్వవిద్యాలయంగా ప్రకటించిన వెంటనే విద్యార్థులు తల్లిదండ్రుల నుంచి అనూహ్య స్పందన లభించిందన్నారు. వారి నమ్మకం తమపై మరింత బాధ్యత పెంచిందని అన్నారు. వీవీఐటీ విశ్వవిద్యాలయం లోకమంతటా ప్రసిద్ధి చెంది తమ విద్యార్థులు గర్వంగా చెప్పుకోగలిగేంత వరకూ విశ్రమించమని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ కొడాలి రాంబాబు మాట్లడుతూ విశ్వవిద్యాలయంలో మౌలిక వసతులు సీమన్స్ ఎక్సలెన్స్, గూగుల్ కోడ్ ల్యాబ్ పూర్తి స్థాయిలో వినియోగించుకోవడం వల్ల విద్యార్థులు ఉపాధి కల్పనకు అవసరమైన మెరుగైన నైపుణ్యాలను సంపాదించుకోవచ్చని తెలిపారు. రిజిస్ట్రార్ వై. మల్లికార్జున రెడ్డి మాట్లడుతూ మెరుగైన భవిషత్తుకు విద్యార్థుల కృషి కీలకమన్నారు. వారి కృషికి సరిపడా అన్ని వసతులను వీవీఐటీ విశ్వవిద్యాలయం అందిస్తుందని తెలిపారు. ప్రతి విద్యార్థిని పరిగణలోనికి తీసుకుని వారి ఉపాధి, ఉన్నత విద్య కొరకు ఉపాధికల్పన, శిక్షణ విభాగం పనిచేస్తుంద న్నారు. మెరుగైన విద్యను నైపుణ్యంగా మార్చి విలువల కొరకు పనిచేసే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దుతామని అన్నారు. అడ్మిషన్ డైరెక్టర్ ఉదయ్ కుమార్ మాట్లడుతూ లక్ష్యాన్ని మొదటి నుంచి నిర్దేశించుకుని, విద్యార్థులు 100 శాతం తరగతులకు హాజరుకావాలని సూచించారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించిన అప్సా స్కూల్ ఆఫ్ బిజినెస్ కోర్సులకు మంచి స్పందన లభించిదని అన్నారు. వైస్ చైర్మన్ వాసిరెడ్డి మహదేవ్. సెక్రటరి సూర్యదేవర బదరిప్రసాద్, అకడమిక్ డీన్ కె.గిరిబాబు, విభాగాధిపతులు పాల్గొన్నారు.



సాగర్ 26 క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు



ప్రకాశం బ్యారేజి దిగువకు విడుదల వరద నీరు

సాగర్‌కు కొనసాగుతున్న వరద ప్రవాహం

విజయపురిసౌత్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయానికి శ్రీశైలం నుంచి వరద ప్రవాహం కొనసాగుతోంది. శుక్రవారం ప్రాజెక్ట్ అధికారులు 26 క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం నీటిమట్టం 587.50 అడుగులు ఉంది. ఇది 305.80 టీఎంసీలకు సమానం. కుడి కాల్వ ద్వారా 8,529, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 33,211, 20 క్రస్ట్‌గేట్లను 5 అడుగులు, 6 క్రస్ట్‌గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 2,43,862, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2,400, ఎల్ఎల్‌సీ ద్వారా 300, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 2,88,302 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి ఇన్‌ఫ్లో 2,88,302 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

విద్యుత్ ఉత్పత్తి ఆపేశాం

రెంటచింతల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని నాగార్జున సాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు చెందిన 20 గేట్లకు గాను 17 రేడియల్ క్రస్ట్ గేట్ల స్పిల్‌వే నుంచి పులిచింతలకు 2,80,282 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈలు సుబ్రహ్మణ్యం, నాగరాజు తెలిపారు. 15 గేట్లు 3 మీటర్లు, 2 గేట్లు 5 మీటర్ల మేర ఎత్తామన్నారు. సాగర్ నుంచి 2,77,316 క్యూసెక్కుల నీరు రిజర్వాయర్‌కు వచ్చి చేరుతోందన్నారు. విద్యుదుత్పత్తిని నిలిపివేశామన్నారు. రిజర్వాయర్‌లో 74.42 మీటర్ల మేర నీరుండగా.. 6.035 టీఎంసీలకు సమానమన్నారు.

ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి

తాడేపల్లి టౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. పులిచింతల ప్రాజెక్టు, ఉన్న కీసర, మున్నేరు, వెలగలేరు ప్రధాన వాగుల నుంచి శుక్రవారం 3,08,838 క్యూసెక్కుల వరద శుక్రవారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతున్నట్టు ఇరిగేషన్ శాఖ జేఈ రాజేష్ తెలిపారు. రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా దిగువకు 2,96,900 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. తూర్పు డెల్టా కాలువకు 7,425 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 4,513 క్యూసెక్కులు వదులుతుండగా గుంటూరు చానల్‌కు నీటి విడుదల నిలిపివేశారు.

ఎంబీబీఎస్ విద్యార్థులపై పెరుగుతున్న సబ్జెక్ట్ భారం!



వీసీ డాక్టర్ చంద్రశేఖర్‌తో విద్యార్థులు, బోధన సిబ్బంది

● హెల్త్ వర్సిటీ వైస్ చాన్సలర్ చంద్రశేఖర్

గుంటూరు మెడికల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఎంబీబీఎస్ విద్యార్థులపై సబ్జెక్ట్ భారం పెరుగుతోందని, ఇది ఆందోళన కలిగించే అంశమని డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన వైద్య విశ్వ విద్యాలయం ఉప కులపతి డాక్టర్ పి.చంద్రశేఖర్ పేర్కొన్నారు. ప్రత్తిపాడు మండలం ఈదుల పాలెంలోని కాటూరి మెడికల్ కాలేజీ, హాస్పిటల్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీబీఎంఈ పాఠ్యక్రమంలో ఉన్న సమస్యలపై ఆందోళన వ్యక్తం చేశారు. ఎంబీబీఎస్ పార్ట్ 1, పార్ట్ 2 విద్యార్థులు ఎదుర్కొంటున్న సిలబస్ ఇబ్బందులు, పార్ట్ 2 విద్యార్థులపై అధికమైన సబ్జెక్టుల భారం గురించి ప్రస్తావించారు. ఈ సమస్యల పరిష్కారానికి విశ్వవిద్యాలయం విద్యార్థుల పక్షానే నిలుస్తుందని హామీ ఇచ్చారు. విద్యార్థుల్లో పెరుగుతున్న ఒత్తిడి, ఆత్మహత్యల సంఖ్య దృష్ట్యా మానసిక ఆరోగ్యాన్ని ప్రోత్సహిచడం అవసరమన్నారు. ఆరోగ్యకరమైన వాతావరణం కోసం ఏటా ఒకసారి వినోదాత్మక, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆయన సూచించారు. వైద్యులు నిరంతర విద్యార్థులుగా ఉంటేనే వృత్తిలో రాణిస్తారని స్పష్టం చేశారు. నిరంతర వైద్య విద్య (సీఎంఈ) కార్యక్రమాలలో పాల్గొనడం, పరిశోధనలో చురుకుగా భాగస్వామ్యం కావడం ఎంతో అవసరమని వీసీ డాక్టర్ చంద్రశేఖర్ వివరించారు. సమావేశంలో కళాశాల డీన్ డాక్టర్ చల్లా మోహన్‌రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ చైతన్య, అకడమిక్ ఇన్‌చార్జ్ డాక్టర్ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్ పోటీలకు..

విజ్ఞాన్ నిరుల విద్యార్థినులు

గుంటూరు(విద్య),ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): అమరావతి క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్ పోటీలకు స్థానిక పలకలూరులోని విజ్ఞాన్ నిరుల ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినులు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ డాక్టర్ పాతూరి రాధిక శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జేఎన్‌టీయూకే విశ్వవిద్యాలయానికి అనుబంధంగా గుంటూరులోని విజ్ఞాన్ నిరుల ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ ఫర్ ఉమెన్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంటర్నల్ హ్యాకథాన్ పోటీలు నిర్వహించారు. ఇందులో మొత్తం 30 మంది విద్యార్థినులు వివిధ విభాగాల పాల్గొన్నారని తెలిపారు. ప్రిన్సిపల్ డాక్టర్ రాధిక మాట్లాడుతూ హ్యాకథాన్ విద్యార్థినుల తర్కిక ఆలోచన, సృజనాత్మకత, సమస్య పరిష్కార నైపుణ్యాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలకు అనుగుణంగా మలచుకునే సామర్థ్యాన్ని పెంపొందించడానికి దోహదపడతాయని పేర్కొన్నారు. విద్యార్థులు ధైర్యంగా సృజనాత్మక సవాళ్లను స్వీకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీన్ ఆర్‌అండ్ డి.డాక్టర్ వి. లక్ష్మణ్ నారాయణ, డాక్టర్ సత్య సందీప్ పాల్గొన్నారు.



విద్యార్థినులతో ప్రిన్సిపల్ డాక్టర్ పాతూరి రాధిక తదితరులు

రాజధానిలో రైతులకు ప్లాట్లు



రైతులకు ప్రొవిజనల్ సర్టిఫికేట్లు ఇస్తున్న సీఆర్‌డీఏ అధికారులు

తుళ్లూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రజారాజధాని అమరావతి నిర్మాణానికి భూములిచ్చిన పెనుమాక గ్రామ రైతులకు ఈ-లాటరీ విధానలో 75 రిటర్నబుల్ ప్లాట్లను కేటాయించారు. ప్లాట్లు పొందిన రైతులకు సీఆర్‌డీఏ అధికారులు ప్రొవిజనల్ సర్టిఫికేట్లు అందజేశారు. లాటరీ కార్యక్రమం శుక్రవారం విజయవాడ ఏపీ సీఆర్‌డీఏ కార్యాలయంలో ల్యాండ్స్ విభాగం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(ఎఫ్ఏసీ) వి.డేవిడ్‌రాజు, స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ ఎన్‌వీఎస్‌టీ వసంతరాయుడు, పెనుమాక డిప్యూటీ కలెక్టర్ ఏ.జి.చిన్నికృష్ణ, ఐటీ ప్రాజెక్టు మేనేజర్ సీహెచ్.శివశంకర రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. 75 ప్లాట్లలో 45 నివాసానికి కాగా 30 వాణిజ్య ప్లాట్లు ఉన్నట్టు అధికారులు తెలిపారు. 33 మంది రైతులు, భూయజమానులకు ఆన్‌లైన్ విధానంలో ప్లాట్లను కేటాయించారు. ఈ-లాటరీకి హాజరైన రైతులకు ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టం ద్వారా నివాస, వాణిజ్య ప్లాట్లకు ముందుగా ట్రైల్‌రన్ వేసిన తర్వాత ప్రత్యక్ష లాటరీ ప్రకియ నిర్వహించారు. రిటర్నబుల్ ప్లాట్లు పొందిన రైతులు రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరగా పూర్తిచేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్‌కు ఎలాంటి డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని ఆయన పేర్కొన్నారు.

ఉత్తమ పంచాయతీలో చెత్త కుప్పలు

● అలంకార ప్రాయంగా ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డు ● పట్టించుకోని అధికారులు



చినకోండ్రు పాడులోని సంపద తయారీ కేంద్రం



చినకోండ్రుపాడు డొంక రోడ్డులో చెత్త కుప్పలు

ప్రత్తిపాడు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఎస్‌డబ్ల్యూ పీసీ షెడ్డు నిర్వహణలో డిల్లీ స్థాయిలో అవార్డును అందుకోవడంతో పాటు మండలంలోనే ఆదర్శంగా నిలిచిన ఉత్తమ పంచాయతీ నడింపాలెం ఇప్పుడు అధమ స్థానానికి వెళ్లే పరిస్థితి ఏర్పడింది. పంచాయతీ పాలకుల నిర్లక్ష్యమో.. అధికారుల పర్యవేక్షణలో లోపమో... ఏమో కాని మండల పరిధిలోని నడింపాలెం పంచాయతీపైకి డాబుగా కనిపిస్తున్నా.. లోపలంతా కుళ్ల వాసన కొడుకొంది. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల ద్వారా గ్రామ పంచాయతీకి ఆదాయంతో పాటు గ్రామాలు పరిశుభ్రంగా ఉంచాలనే లక్ష్యంతో ప్రభుత్వం దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఈ కార్యక్రమానికి ప్రాధాన్యం ఇచ్చి అమలుకు అధికారులకు ఆదేశాలు ఇచ్చింది. అయితే గ్రామస్థాయిలో అధికారులు ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లపై చిన్నచూపు చూస్తున్నారు. గ్రామంలో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు చేర్చడం లేదు. ఉపయోగపడే ప్లాస్టిక్ వ్యర్థాలను మాత్రం అమ్ముకుంటూ మిగిలిన వ్యర్థాలను ఎక్కడ ఖాళీగా ఉంటే అక్కడ పడేస్తున్నారు. ముఖ్యంగా రావిపాటివారి పాలెం సమీపంలో కాలువ వెంట వ్యర్థాలను పడేయడంతో రోడ్డు వెంట తిరిగే వారితో పాటు సమీపంలో ఉండే గృహాల వారికి దుర్వాసన వెదజల్లుతుంది. అంతే కాకుండా కుక్కలు బీభత్సం చేస్తూ పాడు చేస్తున్నాయి. అంతే కాకుండా కోండ్రుపాడు దాటిన తరువాత డొంకరోడ్డు బారుకి చెత్తను డంప్ చేస్తున్నారు.



ప్రత్తిపాడు, చినకోండ్రుపాడు రోడ్డులో చెత్త గుట్టలు

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

యడ్లపాడు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన యడ్లపాడులోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.00గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ డీఈఈ అశోక్‌కుమార్ తెలిపారు. దీనివల్ల మండల పరిధిలోని యడ్లపాడు, మైదవోలు, వంకాయలపాడు, కారుచోల, గుత్తావారిపాలెం, జగ్గాపురం, జాలాది, తిమ్మాపురం, దింతెనపాడు గ్రామాలకు సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

నాదెండ్ల మండల
తెలుగు రైతు, మహిళా కమిటీల ఎన్నిక

నాదెండ్ల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): నాదెండ్ల మండల తెలుగు రైతు, తెలుగు మహిళల విభాగాల కార్యవర్గాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల తెలుగు రైతు అధ్యక్షుడిగా యనమదల సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా గోపు చిన్నపరెడ్డిలను ఎన్నుకున్నారు. అదే విధంగా తెలుగు మహిళా విభాగం అధ్యక్షుడిగా తోట జ్యోతి, ప్రధాన కార్యదర్శిగా ఏ శిరీషలను ఎన్నుకున్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

నూజెండ్ల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నూజెండ్ల ఫ్రైడే ఫ్రైడే కార్యక్రమాల్లో భాగంగా వైద్య సిబ్బంది ఎస్టీ కాలనీల్లో మలేరియా, డెంగీ, టైఫాయిడ్ సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచనలు చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ బాబు, హెల్త్ అసిస్టెంట్ సురేష్, ఏఎన్ఎంలు ఆదిలక్ష్మి, రాధిక, ఆషా కార్యకర్తలు విజయకుమారి, అన్నామణి పాల్గొన్నారు.

కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారు

● డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట రూరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాలో అధికార పార్టీ నాయకుల ఒత్తిడి మేరకు వైసీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని వైసీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. సబ్ జైల్‌లో రిమాండ్‌లో ఉన్న నరసరావుపేట మండలం యలమంద శ్రీనివాస గిరిజన కాలనీకి చెందిన వైసీపీ కార్యకర్తలను శుక్రవారం వైసీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 23న శివకృష్ణ అనే టీడీపీ వ్యక్తి తన అనుచరులతో పెట్రోల్ బాంబులు వేయించుకొని అన్యాయంగా, అక్రమంగా వైసీపీకి చెందిన నలుగురు వైసీపీ కార్యకర్తలపై ఫిర్యాదు చేశారన్నారు. దీంతో ఈశ్వర్ రెడ్డి, మల్లి, సాంబశివరావు, గోపి అనే నలుగురిని అరెస్టు చేశారన్నారు.

అన్నవరం వద్ద రోడ్డు ప్రమాదం

రొంపిచర్ల, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నవరం గ్రామం వద్ద గురువారం రాత్రి రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. రొంపిచర్ల వైపు నుంచి నరసరావుపేట వెళ్తున్న కారు, రొంపిచర్ల వెళ్తున్న ఆటో ఢీకొట్టుకున్నాయి. రెండు వాహనాలు దెబ్బతిన్నాయి. రెండు వాహనాల్లోని వారు స్వల్ప గాయాలతో బయట పడ్డారు.

అడిగిన వారికి లేదనకుండా సాయం

● విమర్శలు చేసేవారు ఒక్కసారి ప్రభుత్వాస్పత్రులకు రావాలి
● సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీలో చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు


చెక్కులను పంపిణీ చేస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): అడిగిన వారికి లేదనకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం అందిస్తున్నారని చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తెలిపారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో 73మంది లబ్ధిదారులకు రూ.38.43 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో చేసిన సాయాన్ని కూటమి ఏడాదిలో అధిగమించడమే అందుకు నిదర్శనమన్నారు. జగన్ రూ.10లక్షల కోట్ల అప్పులు వారసత్వంగా ఇచ్చినా ఆగని సంక్షేమం, అభివృద్ధి, సీఎంఆర్ఎఫ్ సహాయ పంపిణీలే చంద్రబాబు-జగన్‌కు మధ్య తేడా అన్నారు. ఇప్పటివరకు రాష్ట్రంలో రూ.500కోట్లు పైగా, వినుకొండ నియోజక వర్గంలో 832మంది లబ్ధిదారులకు రూ.5 కోట్ల 79 లక్షల 49 వేల 978 సీఎంఆర్ఎఫ్ సాయం చేశామన్నారు. అనారోగ్యంతో ఇబ్బందులు పడుతూ సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో సంప్రదిస్తే తప్పక సాయం లభిస్తుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగానే రూ.1129 కోట్లతో 4,472 గ్రామాల్లో ఏర్పాటుచేయనున్న విలేజ్ క్లినిక్‌ల గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. అక్కడికే వైద్యులు వచ్చి పరీక్షలుచేసి మందులు ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

బొల్లా వచ్చినా మంచి వైద్యం, మందులిచ్చి పంపిస్తాం

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ సందర్భంగానే స్థానిక ప్రభుత్వాసుపత్రుల్లో మందుల్లేవు, మందులు అమ్ముకుంటున్నారని మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు చేసిన ఆరోపణలపైనా ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు తీవ్రంగా స్పందించారు. దమ్ముంటే వచ్చి ఆ విషయం నిరూపించాలని సవాల్ చేశారు. ఆయనే వచ్చినా ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే నాణ్యమైన వైద్యం, నెంబర్-1 మందులు ఇచ్చి పంపిస్తామన్నారు. నోటికొచ్చినట్లు విమర్శలు చేసే ముందు ఒళ్లు దగ్గర పెట్టుకోవాలని హెచ్చరించారు. నోరు అదుపులో పెట్టుకుని నిజాలు మాట్లాడితే బాగుంటుందని హితవు పలికారు. బొల్లా పాపం పండింది కాబట్టి ప్రజలు చిత్తుగా ఓడించినా బుద్ధి రాలేదన్నారు. వారి హయాంలో స్థానిక ప్రభుత్వాసుపత్రుల్లో రోజుకి 10మంది ఓపీ కూడా ఉండేది కాదని, ఇప్పుడది 100 పైగా నమోదవుతోందన్నారు. అందుకే విమర్శలు చేసే బొల్లా అతడి టీమ్‌లో ఎవరైనా ప్రభుత్వ ఆస్పత్రులకు వస్తే స్వయంగా వాళ్లకే అన్నీ నిరూపిస్తామన్నారు.

పుష్పలత కుటుంబానికి జీవీ పరామర్శ

వినుకొండ టౌన్: పట్టణం లోని కళ్యాణపురి కాలనీలో ఈ నెల 21వ తేదీన దోపిడీ దొంగల చేతిలో దారుణంగా హత్యకు గురైన ఆలపాటి పుష్పలత కుటుంబాన్ని ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు శుక్రవారం పరామర్శించారు. మృతురాలి భర్త ఆలపాటి రవిని పరామర్శించి సంఘటన వివరాలు అడిగి తెలుసుకుని ఓదార్చారు. రవి కుటుంబానికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని, దోపిడీ దొంగలను కఠినంగా శిక్షించడం జరుగుతుందన్నారు.

ప్రజాదర్బార్‌లో వినతులు స్వీకరించిన జీవీ


సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ

వినుకొండ టౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ చీఫ్ విప్ కార్యాలయంలో ప్రజా దర్బార్‌లో ప్రభుత్వ చీఫ్ విప్ వీ ఆంజనేయులు పాల్గొన్నారు. నియోజకవర్గంలోని పలు మండలాల నుంచి ప్రజలు తరలివచ్చి తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక వారసత్వానికి మైలురాయి

● తెలుగు భాషా దినోత్సవంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ


తెలుగుతల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నమస్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ, కూటమి నాయకులు

నరసరావుపేట టౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషాదినోత్సవం మన సాంస్కృతిక వారసత్వానికి ఒక మైలురాయి అని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. శుక్రవారం పట్టణంలో గాంధీపార్కులో ఉన్న తెలుగు తల్లి విగ్రహానికి తెలుగు భాష దినోత్సవం సందర్భంగా పూలమాలలు వేశారు. గిడుగు రామమూర్తి ఆలోచనలు మనకు మార్గదర్శకాలుగా ఉంటాయన్నారు. మన భాషా వైవిధ్యాన్ని, చరిత్రలను సంరక్షించడానికి అందరూ కృషి చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సుషీల్‌కు ప్రతిష్టాత్మక తెలుగు కీర్తి పురస్కారం


హర్యానా రాష్ట్రం పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలచారి నుంచి పురస్కారం అందుకుంటున్న సుషీల్ కుమార్

నరసరావుపేట కల్చరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి) పట్టణానికి చెందిన ప్రముఖ విద్యావేత్త, గాయకులు, సంరక్ష సొసైటీ వ్యవస్థాపకుడు, నవయుగ చక్రవర్తి గుర్రం జాషువా మూడవతరం వారసులు బీఆర్ సుషీల్‌కుమార్ తెలుగు భాషా దినోత్సవం, తెలుగు వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని గురువారం హైదరాబాద్‌లోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలో ప్రతిష్టాత్మక తెలుగు కీర్తి పురస్కారాన్ని అందుకున్నారు. పాన్ ఇండియన్ సోషియో కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పూర్వ హర్యానా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ, మాజీ కేంద్ర మంత్రి సముద్రాల వేణుగోపాలాచారి పాల్గొన్నారు. సుషీల్‌కుమార్ పురస్కారం అందుకోవడంపై నరసరావుపేటకు చెందిన పలువురు హర్షం వ్యక్తం చేశారు.

వైసీపీ కౌన్సిలర్ల బాయ్‌కాట్

● అజెండాలోని 33 అంశాలపై ఏకగ్రీవ తీర్మానం
● చర్చనీయాంశమైన వైసీపీ కౌన్సిలర్ల తీరు


సమావేశం నుంచి బయటకు వెళ్తున్న వైసీపీ కౌన్సిలర్లు


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ దస్తగిరి

వినుకొండ టౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): వినుకొండ మున్సిపల్ సాధారణ సమావేశం మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. సమావేశం ప్రారంభం అయిన కొద్ది నిమిషాలకే వైసీపీ వైస్ చైర్మన్‌లు రాజేష్‌కన్నా, గాబ్రియేలు, వైసీపీ మున్సిపల్ కౌన్సిలర్లు సానాల పుల్లయ్య, జయరాజ్, చాపలమడుగు మహబూబీ, బత్తుల వీరమ్మ, పాపసాని బ్రహ్మయ్యలు ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వార్డుల్లో తమకు ప్రాధాన్యం లేదని, టీడీపీ వార్డు ఇన్‌చార్జిలను పిలిచి అధికారులు జెండా వందనం చేయడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ సమావేశం నుంచి బాయ్‌కాట్ చేశారు. దీంతో వైసీపీ కౌన్సిలర్లు ఒకరి తరువాత ఒకరు సమావేశం నుంచి వెళ్లిపోయారు. ముందుగా ప్రారంభ సమావేశంలో అజెండాలోని 33 అంశాలపై తీర్మానానికి అనుకూలంగా సంతకాలు చేసి వారు బయటకు వెళ్లడంపై సభలో చర్చనీయాంశమైంది. ప్రధానంగా సాధారణ సమావేశంలో ప్రవేశపెట్టిన తీర్మానాల్లో వినుకొండ పురపాలకసంఘం పరిధిలోని నవాజ్‌కుంట ముస్లిం ఈద్గా కాంపౌండ్‌వాల్, సైడ్ లెవలింగ్‌కు రూ.40లక్షలు, కారంపూడ రోడ్డులోని 1వ వార్డు స్కూల్‌లో సీసీడ్రెయిన్‌కు రూ.20 లక్షలు, 7వ వార్డు జూనియర్ కాలేజీ గ్రౌండ్ వాకింగ్‌ట్రాక్ లైటింగ్ తదితర పనులకు రూ.10 లక్షలు, ప్రజాఆరోగ్య విభాగానికి పట్టణంలో చెత్త సేకరణకు ట్రాక్టర్ అద్దెకు రూ.5లక్షలు, పురపాలక సంఘ పరిధిలోని వాహన మరమ్మతులకు రూ.20లక్షలతో పాటు ప్రధానంగా గత మూడు సమావేశాల్లో వైసీపీ కౌన్సిలర్లు పూర్తిగా వ్యతిరేకించిన ట్రేడ్‌లైసెన్స్ ఫీజుల పెంపుదల అంశాన్ని సమావేశానికి ముందే వైసీపీ కౌన్సిలర్లు సంతకాలు పెట్టి బాయ్‌కాట్ చేయడం చర్చనీయాంశంగా మారింది. సమావేశానికి ఆలస్యంగా వచ్చిన ఒకరిద్దరు వైసీపీ కౌన్సిలర్లు సమావేశాన్ని తమ పార్టీ నేతలు ఎందుకు బాయ్‌కాట్ చేస్తున్నారో అర్థం కాక మాట్లాడేందుకు ఇష్టంలేక అక్కడి నుంచి వెళ్లిపోయారు. వాస్తవానికి శుక్రవారం ప్రవేశపెట్టిన తీర్మానం అంశాల్లో వైసీపీ కౌన్సిలర్లు ఒకరిద్దరు సభలో నిలదీసేందుకు వచ్చినప్పటికీ ఉదయం వైసీపీ కార్యాలయంలో కౌన్సిలర్లతో ఏర్పాటుచేసిన సమావేశం నేపథ్యంలో బాయ్‌కాట్ అంశాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు. త్వరలో గాంధీజయంతి నాటికైనా వినుకొండ మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో గాంధీ విగ్రహం ఏర్పాటు చేయాలంటూ రెడ్డి నాగపద్మ మున్సిపల్ చైర్మన్ దస్తగిరికి వినతిపత్రం అందజేశారు. సమావేశం ప్రారంభమైన కొద్దిసేపటికే సమావేశం ముగింపుకు కారణమైన వైసీపీ కౌన్సిలర్లపై సర్వత్రా చర్చనీయాంశమైంది. సమావేశానికి ముందు సంతకాలు పెట్టకుండా సమావేశాన్ని తీర్మానం చేసి ఉంటే ఒక అర్థం ఉండేదని, కేవలం వారి వ్యక్తిగత వేతనాల కోసం సంతకాలు పెట్టి తమ మనుగడ కాపాడుకునేందుకే సమావేశాన్ని బాయ్‌కాట్ చేశారని విమర్శలు వినిపిస్తున్నాయి.

మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

వైసీపీ కౌన్సిలర్లు

వినుకొండ టౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): వినుకొండ పట్టణంలో ప్రజా సమస్యలను గాలికి వదిలేసి కూటమి ప్రభుత్వం అలానే మున్సిపల్ చైర్మెన్, అధికారులు కాలయాపన చేస్తున్నారని వైసీపీ కార్యాలయం నుంచి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జాతిపిత స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసి ప్రాణ త్యాగం చేసిన మహాత్మగాంధీ విగ్రహం రాత్రికి రాత్రే మాయం చేశారని వైసీపీ కౌన్సిలర్లు ఆరోపించారు. మహాత్మా గాంధీ విగ్రహం మున్సిపాలిటీ నిధులతో ఏర్పాటు చేయాలని గత సర్వసభ్య సమావేశంలో కోరగా దాని మీద మున్సిపల్ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. వారి చర్యలకు నిరసిస్తూ వినుకొండ మున్సిపల్ సర్వసభ్య సమావేశం బాయికాట్ చేసినట్టు వారు తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ రాజేష్ ఖన్నా, బేతం గాబ్రియేల్, వార్డు కౌన్సిలర్లు బాషా, గంట కాలేశా, పాపసాని బ్రహ్మయ్య, సానాల పుల్లయ్య, జయరాజు, చాపలమడుగు మహబూబ్ బీ, బత్తుల వీరమ్మ, కో ఆప్షన్ దేవదాసు తదితరులు బాయికాట్ చేసినట్లు వారు ప్రకటనలో తెలిపారు.


చిలకలూరిపేట ఏఎంజీ పాఠశాలకు అవార్డులు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, పాల్గొన్న విద్యార్థులు

ఐదు పాఠశాలలకు క్రీడా ప్రతిభా అవార్డులు

● జిల్లాలో ప్రథమం, రాష్ట్రంలో ద్వితీయ స్థానం
చిలకలూరిపేట ఏఎంజీ హైస్కూల్

నరసరావుపేట టౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖ, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పల్నాడు జిల్లాలో క్రీడా ప్రతిభా అవార్డులు-2025ను పాఠశాల విద్యార్థులు సాధించిన విజయాల ఆధారంగా ఐదు పాఠశాలలను ఎంపిక చేశారు. శుక్రవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ముఖ్యఅతిథిగా హాజరై అవార్డులను అందజేశారు. జిల్లాలో చిలకలూరిపేట ఏఎంజీ ఉన్నత పాఠశాల ప్రథమం, నందిగామ జిల్లా పరిషత్ ఉన్నపాఠశాల ద్వితీయ, వినుకొండ గుడ్ షెపర్డ్ హైస్కూల్ తృతీయ, పెదమక్కెన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నాలుగో, మద్ది కామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఐదో స్థానంలో నిలిచాయి. చిలకలూరిపేట ఏఎంజీ ఉన్నత పాఠశాల జిల్లా స్థాయిలో ప్రథమం, రాష్ట్ర స్థాయిలో ద్వితీయస్థానం సాధించింది. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఉదయ్‌బాస్కర్, హుస్సేన్, స్కూల్ గేమ్స్ సెక్రటరీ ఎన్.సురేష్‌కుమార్, పీడీ చిన్నరామయ్య, ఖాదర్ మస్తాన్, నాగరాజు, అనిల్ దత్తా, సాంబశివారావు, అజేయ్ కపిల్, రాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా తెలుగుభాషా దినోత్సవం


క్రీడలను ప్రారంభిస్తున్న చైర్మన్ ఎంఆర్ శేషగిరిరావు, డైరెక్టర్ శ్రావ్య పృథ్వీరాజు, డాక్టర్ బండ్ల రవితేజ తదితరులు


ధ్యాన్‌చంద్, గిడుగు వెంకట రామమూర్తి చిత్రపటాలకు నివాళి అర్పిస్తున్న ప్రిన్సిపాల్ బర్నబాస్ తదితరులు

● రొంపిచర్ల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషను మరచి పోవద్దని రెడ్డిపాలెం పీఎంశ్రీ ఏపీ మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ రవినాయక్ శుక్రవారం తెలిపారు. మాతృ భాష దినోత్సవం, క్రీడా దినోత్సవాన్ని పాఠశాల ఆవరణలో నిర్వహించారు. విద్యార్థులకు వివిధ రకాల పోటీలను నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, స్కూల్ యాజమాన్య కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

● వినుకొండ: తెలుగు భాష దినోత్సవాన్ని పట్టణంలోని విజేత హైస్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. తొలుత 'గిడుగు' చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్, డైరెక్టర్ కావూరి సాయికుమార్, ఆవులమంద బ్రాహ్మయ్యలు గిడుగు వెంకట రామమూర్తి సేవలు అభినందనీయమన్నారు.

కేరిడ్జి ఇంటర్నేషనల్ స్కూల్‌లో ...

నరసరావుపేట టౌన్: స్థానిక కేరిడ్జి ఇంటర్నేషనల్ స్కూల్‌లో శుక్రవారం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవం, గిడుగు వెంకట రామమూర్తి జయంతి సందర్భంగా తెలుగు భాష దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో తెలుగు భాష శాఖాధిపతి అన్నపూర్ణ, స్కూల్ చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ బర్నబాస్, క్యాంపస్ ఇన్‌చార్జి బాపూజీ, రాణి, భూపతి, పీడీ ఎం కిషోర్‌బాబు, శేషగిరి, మహిత పాల్గొన్నారు.

ఏఎంరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో

నరసరావుపేటలోని ఏఎంరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్, డిప్లొమో విద్యార్థులకు వాలీబాల్, త్రోబాల్, పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ మల్లికార్జున్, డిప్లొమో పిన్సిపాల్ డాక్టర్ కే కృష్ణారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

● నూజెండ్ల: మండలంలోని కంభంపాడు జడ్పీ పాఠశాల, పెద్దవరం, మండల పరిషత్ పాఠశాలలో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు.

జేఎన్‌టీయూ నరసరావుపేటలో...

నరసరావుపేట టౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని జేఎన్‌టీయూ నరసరావుపేట క్యాంపస్‌లో శుక్రవారం ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడా పోటీలలో విజేతకు బహుమతులు, ప్రశాంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసరావు, పీడీ డాక్టర్ జీపీ రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

కృష్ణవేణి డిగ్రీకళాశాలలో ...

కృష్ణవేణి డిగ్రీకళాశాలలో శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. క్రాస్ కంట్రీ, కబడ్డీ, ఖోఖో, వాలిబాల్, క్రికెట్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్ ఎంఆర్‌కే సతీష్, పీడీ ఈదర ఆదిబాబు, మహమ్మద్, తిరుపతిరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎంఏఎం ఫార్మసీలో ...

స్థానిక కేసానుపల్లిలోని ఎంఏఎం ఫార్మసీ కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో చైర్మన్ మేదరమెట్ల రామశేషగిరిరావు, డైరెక్టర్ దరువూరి శ్రావ్యపృథ్వీరాజు, ప్రిన్సిపాల్ ఎం.ప్రసాదరావు, డాక్టర్ రవితేజ బండ్ల, డాక్టర్ సాధినేని రామారావు పాల్గొన్నారు.

ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో...

స్థానిక కేసానుపల్లిలోని ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ క్రీడాదినోత్సవ వేడుకలును శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చైర్మన్ షేక్ మీరావలి, ప్రిన్సిపాల్ డాక్టర్ జీ నాగమల్లేశ్వరరావు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ షేక్ కరీమ్ మొహీద్దీన్, ఎండీ షేక్ మస్తాన్‌షరీఫ్, పీడీ హెచ్ గంగాధర్, విద్యార్థులు అధ్యాపకులు పాల్గొన్నారు.

యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి
దేవాలయ నిర్మాణానికి విరాళం

నరసరావుపేట టౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోట బజార్, పులుపులవారి వీధిలో ఉన్న వీరాంజనేయ సహిత యోగనంద లక్ష్మీ నరసింహస్వామి ఆలయ రాతి నిర్మాణానికి శుక్రవారం లక్ష రూపాయల విరాళం కమిటీ సభ్యులకు అందజేశారు. ఎంజీసీ మార్కెట్ వద్ద బార్బ ర్ షాప్ యజమాని కొండేపాటి మంగేశ్వరరావు, సామ్రాజ్యం దంపతులు ఈ విరాళాన్ని అందజేశారు.

వాడవాడలా గణనాథుడి ఉత్సవాలు

నరసరావుపేట టౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మద్ది రాఘవయ్య బావి వీధి టెలిఫోన్ ఎక్స్చేంజ్ వద్ద యంగ్ స్టార్స్ హెల్పింగ్ సర్వీసెస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దశావతార సహిత మహావీర గణపతి నవరాత్రుల మహోత్సవం భాగంగా 1108 లడ్డూలతో శుక్రవారం సహస్ర అష్టోతర పూజా కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా గరికతో సహస్రనామార్చన పూజ, చతుర్దశ మహామంగళ హారతులు ఇచ్చారు. కార్యక్రమంలో శ్రీమహావీర గణపతి ఉత్సవ కమిటీ కన్వీనర్ వనమా పవన్‌కుమార్, కమిటీ సభ్యులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

● యడ్లపాడు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాలలో వినాయకచవితి ఉత్సవాలు మూడో రోజైన శుక్రవారం కూడా కొనసాగాయి. పెద్దసంఖ్యలో వచ్చిన భక్తులతో మండపాలు కిక్కిరిసిపోయాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

మూడు గ్రామాలలో నిమజ్జనోత్సవం

మండలంలోని ఉన్నవ, ఉప్పరపాలెం, చెంఘీజ్‌ఖాన్‌పేట గ్రామాలలో నిమజ్జన వేడుకలు జరిగాయి. ఉన్నవలో ఆర్య వైశ్యసంఘం ఆధ్వర్యంలో, ఉప్పరపాలెంలో కోటేశ్వరరావు యూత్ ఆధ్వర్యంలో, చెంఘీజ్‌ఖాన్‌పేటలో శాలివాహన యూత్ ఆధ్వర్యంలోని గణనాథులు శుక్రవారం నిమజ్జనానికి తరలివెళ్ళాయి. ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

● వినుకొండ టౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): వినుకొండ పట్టణంలోని నిమ్మళబావి బజారులోని శ్రీ కందుకూరి అంకమ్మ తల్లి దేవస్థానం ఆవరణలో జరుగుతున్న గణేష్ ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. మూడో రోజు భక్తుల కోసం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శ్రీ లక్ష్మి నరసింహ స్వామి సేవా సమితి సభ్యులు కూడా గణేశుడిని దర్శించుకున్నారు. అలాగే మహిళలు ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకుంది. పట్టణంలోని ఏనుగుపాలెం రోడ్డులోని అంకాలమ్మ గుడి వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండలంలో సినీ నిర్మాత లగడపాటి శ్రీనివాసరావు టీడీపీ యువతతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

● శావల్యాపురం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంటుపాలెం, వయ్యకల్లు, చిన్నకంచెర్ల, శావల్యాపురం తదితర గ్రామాల్లో వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలను భక్తులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గుంటుపాలెంలో ఇన్‌చార్జి సర్పంచ్ మద్దినేని ఆంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించిన లడ్డు వేలంను కొర్రపాటి అంజిబాబు, లక్ష్మిల కుమారుడు అనిల్ అత్యధికంగా రూ.1,01,500లకు దక్కించుకొన్నాడు. గుంటుపాలెంలో సీనియర్ టీడీపీ నేత డాక్టర్ అన్నవరపు వీరాంజనేయులు, గ్రామనేత పచ్చవ శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహం వద్ద దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. వయ్యకల్లులో సర్పంచ్ గోనుగుంట్ల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహం వద్ద నిర్వహించిన లడ్డూ వేలంను కర్రి కనకనారాయణ రూ.26వేలకు దక్కించుకొన్నారు. చిన్నకంచెర్లలోని తూర్పుబజారు వినాయక విగ్రహం వద్ద నిర్వహించిన లడ్డూ వేలంను చెన్నుబోయిన బ్రదర్స్ రూ.50వేలకు దక్కించుకొన్నారు. శావల్యాపురంలో కాకతీయ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వామివారిలడ్డూను కాకాని వేణుగోపాలరావు రూ.61వేలకు దక్కించుకొన్నారు. విగ్రహాలను మేళతాళలతో గ్రామపురవీధులలో అంగరంగ వైభవంగా ఊరేగించి అద్దంకి బ్రాంచ్ కెనాల్, కొంకేరువాగుల్లో నిమజ్జనం చేశారు.


శావల్యాపురం: గుంటుపాలెంలో లడ్డూ పాటను దక్కించుకొన్న అనిల్


వినుకొండ: గణపతికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

రూ 1.51 లక్షలు పలికిన వినాయకుడి లడ్డూ

నూజెండ్ల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలో వినాయక ఉత్సవాలు ఉత్సాహభరిత వాతావరణంలో శుక్రవారం జరిగాయి. భూమాయపాలెం గ్రామంలో నిర్వహించిన లడ్డూ వేలంలో మాజీ సర్పంచ్ రాజవరపు ఏసుబాబు రూ.1.51 లక్షలకు వినాయక లడ్డూను కైవసం చేసుకున్నారు. కమ్మవారిపాలెం, వినాయకుని శోభాయాత్రలో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. గుండ్లకమ్మ నది వద్ద జరుగుతున్న వినాయక విగ్రహాల నిమజ్జన ఏర్పాట్లను నరసరావుపేట ఇన్‌చార్జ్ డీఎస్పీ వెంకటరమణ, వినుకొండ రూరల్ సీఐ బీ ప్రభాకర్, ఎస్ఐ బీవీ కృష్ణారావులు పరిశీలించి సూచనలు చేశారు.

శాకంబరీ అలంకారంలో వినాయకుడు

నరసరావుపేట టౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాలపాడు రోడ్డులో ఉన్న సాయి గ్రీన్‌ఫీల్డ్ అపార్టుమెంట్‌లో వినాయకుడికి శాకంబరీ అలంకారం జరిగింది. వివిధ కూరగాలయతో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా ప్రత్యేకపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

● రొంపిచర్ల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గ్రామాల్లో వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన వినాయక మండపాల్లో ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి. సాయంత్రం భజనా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. రొంపిచర్లలోని పడమటిపాలెం, బోసు బొమ్మ సెంటర్, రామాలయం, దేవుడు మాన్యం కాలనీల వద్ద ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహాలు పూజలు అందుకుంటున్నాయి. మాచవరం, సంతగుడిపాడు, సుబ్బయ్యపాలెం గ్రామాల్లో వినాయక నిమజ్జనోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

● బొల్లాపల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లటూరు, సంగినీడుపాలెం, బొల్లాపల్లి తదితర గ్రామాల్లో శుక్రవారం మూడో రోజు గణేష్ నిమజ్జనాలు ఘనంగా నిర్వహించారు. గణేష్ నిమజ్జనాల సందర్భంగా భారీ డీజేలతో గ్రామంలో ఊరేగింపుగా తరలివెళ్ళి వెల్లటూరు కురవ సమీపంలోని ఎన్ఎస్‌పీ మెయిన్ కెనాల్‌లో నిమజ్జనం చేశారు. ఆయా కార్యక్రమంల్లో యువత, మహిళలు, భక్తులు భారీగా తరలి వచ్చారు.